ప్రజాశక్తి

సోమవారం 3 జులై 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

కందిపప్పు రూ.150





టమోటా రూ.120

భారీగా పెరుగుతున్న ధరలు

చోద్యం చూస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - గుంటూరుజిల్లా ప్రతినిధి

పప్పుదినుసులు, కూరగాయల ధరలు భారీగా పెరుగుతున్నాయి. ప్రజలు ఎక్కువగా వినియోగించే వస్తువుల ధరలు గత నెల రోజుల్లో అనూహ్యంగా పెరిగాయి. కందిపప్పు కిలో రూ.150కి పెరిగింది. రెండునెలల క్రితం కిలో కందిపప్పురూ.100 ఉండగా గత నెలలో రూ.120కు పెరిగింది. ఈనెలలో రూ.30 మరో పెరిగింది. మినపగుళ్ల రూ.100 నుంచి రూ.130కి పెరిగాయి. వేరుశనగ గుళ్ల రూ.130-150 పలుకుతుండగా పచ్చి పప్పు మాత్రం రూ.70 వద్ద నిలకడగా ఉంది.

ఉమ్మడి జిల్లాలో గతేడాది 50 వేల ఎకరాల్లో కందిసాగు చేయగా పంట చేతికి వచ్చే సమయంలో క్వింటాళ్ రూ.8 వేల నుంచి రూ.9వేలు పలికింది. ప్రస్తుతం దేశీయంగా కందిపప్పు నిల్వలు లేకపోవడం వల్ల బర్మా, సౌత్ ఆఫ్రికా దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారని వ్యాపారులు తెలిపారు. ప్రస్తుతం కందులు క్వింటాళ్ ఏకంగా రూ.12 వేలకు పెరిగాయి. అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల వల్ల దిగుబడి తగ్గడం వల్ల పంట మొత్తం వ్యాపారులచేతికి వెళ్లిన తరువాత ధరలుపెంచారు.

ప్రభుత్వం రేషన్‌కార్డులపై కందిపప్పు సరిగా సరఫరా చేయడంలేదు. అవసరమైన మేరకు సరఫరా రావడంలేదని చెబుతూ మండలాల్లో రెండు మూడు నెలలకు ఒకసారి ఇస్తున్నారు. పట్టణాల్లో సరఫరా లేదని రేషన్ సరఫరా చేసు వాహనదారులు ఇవ్వకుండానే వెళ్లిపోతున్నారు. సరఫరా ఉన్నా ప్రజలకు బియ్యం ఒక్కటి మాత్రమే ఇచ్చి ఇందుకు కిలోకి రూ.8 నుంచి రూ.10 ఇచ్చి మిగతా వస్తువులు ఇవ్వకుండానే ఇచ్చినట్టు బయోమెట్రిక్ మిషన్‌లో అక్రమాలకు పాల్పడుతున్నా అధికారుల పర్యవేక్షణ ఉండటం లేదు.

జిల్లాలో కూరగాయల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. గత నెల రోజుల్లో ప్రతి వెరయిటీకి కిలోకి రూ.10 నుంచి రూ.20 వరకుపెరిగాయి. ప్రస్తుతం టమోటా ధర మార్కెట్‌లో రూ.120కి చేరింది. రైతుబజార్లలో రూ.50కి ఇస్తామన్నా సరఫరా పూర్తిగా లేదు. ఉన్నా నాణ్యత తక్కువగా ఉందని వినియోగదారులు వాపోతున్నారు. మార్కెట్‌లో కిలో రూ.20కి తక్కువగా దొరికే కూరగాయాలు లేవంటే అతిశయోక్తి కాదు. రైతు బజార్లలో ధరలు ఇలా ఉన్నాయి. క్యారెట్ రూ.50,కాకర రూ.36, బీర రూ.48, క్యాబేజి రూ.22, దొండ రూ.29, బంగాళదుంపలు రూ.22, గోరుచిక్కుడు రూ.35, ఉల్లిపాయలు రూ.20, దోసకాయ రూ.17, పొట్ల రూ.38, సొర రూ.24, బీట్ రూట్ రూ.31లకు విక్రయించారు. ఆకు కూరలు కట్ట రూ.15 నుంచి రూ.20 వరకు పలుకుతున్నాయి.

రెండు నెలలుగా వర్షాలు లేకపోవడం, ఎండల తీవ్రత కావడంతో కూరగాయల తోటలు దెబ్బతింటున్నాయి. వేసవి తీవ్రత వల్ల కూరగాయలు తోటలు దెబ్బతిన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 30 వేల ఎకరాల్లో కూరగాయల సాగవుతోంది. యడ్లపాడు, ప్రత్తిపాడు, గుంటూరు రూరల్, చేబ్రోలు, అమరావతి, తాడేపల్లి, మంగళగిరి తదితర ప్రాంతాల్లో కూరగాయల తోటలు ఎక్కువగా ఉన్నాయి. నీటి ఎద్దడి పెరగడం, కాల్వల ద్వారా నీరు రాకపోవడం వల్ల ఆకుకూరలు దెబ్బతిన్నాయి.



రోడ్డుపై బైఠాయించిన ఆందోళనకారులు, మృతి చెందిన బాలిక (ఇన్‌సెట్)

బాలికను బలిగొన్న అతివేగం

- యువకుల బైక్ ఢీకొని ఎనిమిదేళ్ల చిన్నారి దుర్మరణం
- తెనాలి - చందోలు రహదారిపై ఆందోళనకు దిగిన బాధితులు
- బక్రీద్ పండగ కోసం హైదరాబాద్ నుండి వచ్చిన బాలిక

ప్రజాశక్తి-తెనాలి

మితిమీరిన వేగం ఎనిమిదేళ్ల బాలిక ప్రాణాన్ని బలిగొంది. ఇద్దరు యువకులు బైక్‌పై వెళుతూ చిన్నారిని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన బాలికను తెనాలి వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం జయవాడ తరలించగా ఆదివారం తెల్లవారుజామున మృత్యువాత పడింది. మండంలోని జగ్గడిగుంటపాలెంలో శనివారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంపై స్థానికులు, పోలీసుల వివరాలు ప్రకారం.. హైదరాబాదులో ఉంటున్న బాలిక రూకియా (8) బక్రీద్ పండుగ నిమిత్తం జగ్గడిగుంటపాలెంలోని అమ్మమ్మ

▶ 2లో



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు విజయ్ కుమార్

విద్యుత్ ఛార్జీలపై ఉద్యమ కార్యాచరణ

భారాలపై ముఠా కార్మికుల నిరసన

యుసిసి ముసాయిదాను ప్రజల ముందుంచాలి

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న హనుమంతరెడ్డి

యూనిఫామ్ సివిల్ కోడ్(యుసిసి)పై రౌండ్‌టేబుల్ సమావేశం బ్రాడీపేటలోని యుటిఎఫ్ మీటింగ్ హాల్లో ఆదివారం నిర్వహించారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక, ఆవాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు షేక్ బాషా అధ్యక్షత వహించారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ ఎస్.హనుమంతరెడ్డి మాట్లాడుతూ దేశంలో 44వ అధికరణలో చెప్పిన యుసిసి గురించి

▶ 2లో

పరుగులు పెట్టించిన సూపరింటెండెంట్

- జిజిహెచ్‌లో ఆకస్మిక తనిఖీలు
- జనరల్ మెడిసిన్ విభాగానికి 50 మంచాలు కేటాయింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



వార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ వై.కిరణ్‌కుమార్

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్) సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన గంటల వ్యవధిలోనే చికిత్సలు, సదుపాయాలపై డాక్టర్ వై.కిరణ్ కుమార్ దృష్టిసారించారు. మెడిసిన్ విభాగానికి 50 అదనపు పడకలు కేటాయించారు. ఆదివారం మెడికల్ వార్డులను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన దాదాపు మూడు గంటలపాటు సిబ్బందిని పరుగులు పెట్టించారు. ఆసుపత్రిలోని 102 మెడిసిన్ వార్డును మొదటగా తనిఖీ చేశారు. అక్కడ ఉన్న పరిస్థితిని చూసి ముక్కుపై వేలేసుకున్నారు. 102 వార్డుల్లో బాత్ రూములు బ్లాక్ ఉండటాన్ని గమనించారు.

▶ 2లో

రోగులను సంతోషంగా పంపడమే లక్ష్యం

- శస్త్రచికిత్సల్లో జాప్యాన్ని నిరోధిస్తాం - క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేస్తాం
- ప్రజాశక్తితో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్

8లో

జెవికె కిట్ల పంపిణీలో జాప్యంపై

డిఇఒ సహా పలువురికి షోకాజ్‌లు

ఎఎంతోపాటు ఐదుగురు ఎంఇఒలు, 19 మంది హెచ్‌ఎంలకు జారీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యార్థులకు జెవికె కిట్ల పంపిణీలో జాప్యంపై పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారితోపాటు అసిస్టెంట్ అకాడమిక్ మోనిటరింగ్ అధికారి, ఐదుగురు ఎంఇఒలు, 19 మంది హెచ్‌ఎంలకు పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలలో కిట్ల పంపిణీ ఆలస్యం అవుతున్నట్లు సమాచారం మేరకు కలెక్టర్ నోటీసులిచ్చారు. డిఇఒ శామ్యూల్, అసిస్టెంట్ అకాడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు, మాచర్ల, క్రోసూరు, రెంటచింతల, వెల్దుర్తి, నరసరావుపేట ఎంఇఒలు వి.నాగయ్య, జి.ఏసురత్నం, ఎ.సురేష్, బి.గోవిందయ్య, ఎస్.నాగేశ్వరరావు నోటీసులు అందుకున్నారు. వీరితోపాటు చిలకలూరిపేట మండలం మురికిపూడి జెడ్‌పి పాఠశాల, నాదెండ్ల మండలం సాతులూరు, నాదెండ్ల జెడ్‌పి పాఠశాలల హెచ్‌ఎంలు, మాచర్ల మండలం విజయపురిసౌత్ ఏపి సౌత్ ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ హెచ్‌ఎం, నరసరావుపేట ఎస్‌బిఆర్ ఎంపిఎల్ పాఠశాల, వినుకొండ సోషల్ వెల్ఫేర్ స్కూల్,

▶ 2లో

43 ఎంఇఒ-1 పోస్టులు భర్తీ

2లో



బాలికను బలిగొన్న అతివేగం

(మొదటి పేజీ తరువాయి)

తాతయ్యల ఇంటికి తల్లితో వచ్చింది. శనివారం అర్ధరాత్రి బాలిక తల్లి తిరిగి హైదరాబాదు పయనమైంది. ఆమెను పంపించేందుకు అమ్మమ్మ, తాతయ్యలతో కలిసి బాలిక రోడ్డు దాటుతుండగా అదే ప్రాంతానికి చెందిన జీవన్ దేవ్, సుబ్బు అనే ఇద్దరు యువకులు మితిమీరిన వేగంతో బైక్ పై వచ్చి రోడ్డు దాటుతున్న చిన్నారిని ఢీకొట్టారు. అపస్మారకస్థితికి వెళ్లిన బాలికను కుటుంబ సభ్యులు తొలుత తెనాలిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. బాలిక పరిస్థితి విషమించడంతో రాత్రికి రాత్రి విజయవాడ తరలించారు. చికిత్స పొందుతున్న బాలిక ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

తెనాలి-చందోలు రహదారిపై ఆందోళన..

ఇదిలా ఉండగా బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు ఆదివారం రాత్రి తెనాలి-చందోలు రహదారిపై జగ్గడిగుంటపాలెం వద్ద ఆందోళనకు దిగారు. నడిరోడ్డుపై ఆందోళనకారులు పెద్ద ఎత్తున టైర్లు కాల్చారు. నిందితులను తమకు అప్పగించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగడంతో ఆందోళన విరమింప చేసినందుకు పోలీసులు ఆందోళన కారులతో మాట్లాడుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆలపాటి పరామర్శ..

ఘటన వివరాలను తెలుసుకున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ఆదివారం రాత్రి జగ్గడిగుంటపాలెం చేరుకున్నారు. ఈ సందర్భంగా తమకు తీరని అన్యాయం జరిగిందంటూ బాలిక కుటుంబ సభ్యులు ఆయన వద్ద ఘొల్లుమన్నారు. ఈ సందర్భంగా ఆయన డీఎస్పీ బి.జనార్ధనరావు, సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ తో మాట్లాడి, నిందితులపై తక్షణ చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు.

పరుగులు పెట్టించిన సూపరింటెండెంట్

(మొదటి పేజీ తరువాయి)

బాత్ రూముల్లో తలుపులు విరిగిపోయి ఉండటాన్ని పరిశీలించారు. పరిశుభ్రత లేక పోవడం, దుర్వాసన రావడాన్ని గుర్తించారు. వాటర్ పైప్‌లైన్‌ల్లో నుంచి నీరు వృథాగా పోవడాన్ని గమనించారు. బాత్‌రూమ్‌లకు విరిగిపోయిన తలుపులకు తక్షణమే మరమ్మతులు చేయాలని, బ్లాక్ అయినా లెట్రిన్‌లను సరి చేయాలని శానిటేషన్ సిబ్బందికి ఆదేశించారు. దాదాపు 10-15 మంది రోగులు మంచాలు లేక ముడు నాలుగు రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్నారని ఆయన గమనించారు. రోగులను స్ట్రెచర్‌పై ఉంచి వైద్య సేవలను అందించడంపై అసంతప్తి వ్యక్తం చేశారు. ఈ వార్డుతో పాటు మిగతా జనరల్ మెడిసిన్ వార్డులను కూడా మంచాల కొరత, స్ట్రెచర్‌పై వైద్యం చేస్తున్న విధానాన్ని గుర్తించారు. వెంటనే మంచాలు ఇవ్వాలని ఆదేశించారు. మూడో అంతస్తులో ఉన్న 330 మెడికల్ వార్డులో పడకల కొరత ను గుర్తించి నివారణ చర్యలను చేపట్టారు. రెండు వార్డుల్లో ఖాళీగా ఉన్న ప్రదేశంలో పది పడకలను ఏర్పాటు చేశారు. అదే క్రమంలో 'బి' క్లాసులో ఉన్న 20 గదులలో గదికి రెండు చొప్పున పడకలను ఏర్పాటు చేసి జనరల్ మెడిసిన్ విభాగానికి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విభాగానికి మొత్తం 50 పడకలను అందుబాటులో తీసుకువచ్చారు. పలువిభాగాల్లో దుర్గంధ భరితంగా ఉన్న బాత్ రూమ్‌ల పరిసరాలను గుర్తించి పారిశుధ్య సిబ్బంది పై అసంతప్తి వ్యక్తం చేశారు. రోగి సహాయ కులను కట్టడి చేసి ఐసియు బాత్ రూమ్ లోపలకు వెళ్లకుండా నిషేధిత బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆ ప్రాంతంలో సెక్యూరిటీ సిబ్బందిని పెంచాలని, నర్సింగ్ సిబ్బంది కౌంటర్స్ ఐసియు లోపల ఉండేలా మార్చాలని చెప్పారు. తక్షణమే అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆర్ఎంఒ డాక్టర్ సతీష్ కుమార్‌ను ఆదేశించారు.

విద్యుత్ ఛార్జీలపై ఉద్యమ కార్యాచరణ

- సంఘటిత పోరాటాలకు రౌంట్ టేబుల్ సమావేశం పిలుపు
- 5-10 తేదీల్లో పల్నాడు కలెక్టరేట్ వద్ద రిలేదీక్షలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

విద్యుత్ ఛార్జీలపై సంఘటిత పోరాటాలు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చాఇంది. వివిధ ఛార్జీల పేరుతో పెంచిన విద్యుల్ బిల్లుల రద్దు కోసం పల్నాడు జిల్లా పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీవో హోంలో రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం న్విహించారు. సమావేశానికి సిపిఎం పట్టణ కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ మాట్లాడుతూ సామాన్య, మధ్యతరగతి ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం సరైన నిర్ణయం కాదన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసరాలతో పేద ప్రజలు అర్ధాకలితో అలాంటిస్తున్నారని, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎంసిపిఐ (యు), జైభీమ్ భారత్ పార్టీ, ఎంఐఎం, సిఐటియు, రైతు సంఘం, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. ఉద్యమ కార్యాచరణలో భాగంగా 5-10 తేదీల్లో కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో సోలార్ విద్యుత్ ప్యానల్ డీలర్ రామ్‌మోహన్‌రావు, ఎంసిపిఐ (యు) జిల్లా కార్యదర్శి షేక్ మొహిద్దిన్‌బాష, జై భీమ్ భారత్ పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా సమన్వయకర్త జి.జాన్‌పాల్, ఎంఐఎం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు షేక్ కరీముల్లా, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.రామారావు, నాయకులు కె.ఆంజనేయులు, రైతు సంఘం నాయకులు బి.నాగేశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు పూర్ణచంద్రరావు, సిఐటియు నాయకులు జి.మల్లీశ్వరి, ఎస్.వెంకటేశ్వరరాజు, శ్రీను, ఐద్వా నాయకులు నాగమ్మ పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న ముఠా కార్మికులు, నాయకులు

విద్యుత్ భారాలపై ముఠా కార్మికుల నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో ప్రజలపై ట్రూఅప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై మోపుతున్న విద్యుత్ అదనపు భారాలు రద్దు చేయాలని సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె.నళినీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం గుంటూరు నగర ముఠా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆదివారం మస్తాన్‌దర్గా సెంటర్‌లోని టింబర్ ముఠా కార్మికుల నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు విద్యుత్ కంపెనీల నుండి కనీసం 10 శాతం విద్యుత్తు కొనుగోలు చేయాలని కేంద్రం విధించిన నిబంధనలతో అధిక చార్జీలు చెల్లించి విద్యుత్ కొనుగోలు చేసి ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ బొగ్గు కంపెనీలు తక్కువ ధరకు మంచి బొగ్గును అందజేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ధర చెల్లించి విదేశీ బోగ్గు కొనుగోలు చేయడం ఎందుకని ప్రశ్నించారు. ప్రజలపై ట్రూఅప్, ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో భారాలు మోపటం ఎందుకని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. ముఠా వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యుత్ సంస్కరణలు అదానీ, కార్పోరేట్‌లకు లాభాలు చేకూర్చే విధంగా ఉన్నాయని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో అదానీ కంపెనీకి లాభాలు చేకూర్చేందుకు రూ.13 వేల కోట్లు ప్రజలపై భారాలు మోపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడిందని, స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగంలోనే విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా ప్రజలపై మోపే అదనపు భారాలను తగ్గించాలని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు ఎస్.కె కాసిం షహీద్, టింబర్ ముఠా మేస్త్రి వెంకటేశ్వర్లు, హుస్సేను, ముఠా కార్మికులు పాల్గొన్నారు.



ఎంఇఒకు నియామక పత్రం ఇస్తున్న ఆర్‌జెడి

43 ఎంఇఒ-1 పోస్టులు భర్తీ

ప్రజాశక్తి-గుంటూరు

పాఠశాల విద్య గుంటూరు ఆర్‌జెడి పరిధిలో ఎంఇఒ-1 ఖాళీలు భర్తీకి ఆదివారం ఆర్‌జెడి వి.ఎస్.సుబ్బారావు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 89 ఖాళీలకుగాను 43 ఖాళీలను భర్తీ చేశారు. గుంటూరు, పల్నాడు జిల్లాకు సంబంధించి క్రోసూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం జి.ఏసురత్నం మేడికొండూరు ఎంఇఒగా నియమితులయ్యారు. గుంటూరు తూర్పు మండలానికి ప్రకాశం జిల్లా, జెపి చెరువు జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎం వీసం వెంకటేశ్వరరావు, తాడేపల్లి ఎంఇఒగా బాపట్ల ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం గరిక శాంతకుమారి, కొల్లిపరకు ప్రకాశం జిల్లా పామూరు గవర్నమెంట్ హైస్కూల్ హెచ్‌ఎం జి.సాల్మన్‌రాజు, చేబ్రోలుకు సంతమాగులూరు గవర్నమెంట్ హైస్కూల్ హెచ్‌ఎం ఎ.వెంకట హనుమంతప్రసాద్, నర్సరావుపేటకు గురజాల గవర్నమెంట్ హైస్కూల్ హెచ్‌ఎం వి.ఏసుబాబు, ఫిరంగిపురం ఎంఇఒగా ప్రకాశం జిల్లా మైనంపూడి గవర్నమెంట్ హైస్కూల్ హెచ్‌ఎం షేక్.మహబూబ్ సుభాని, మంగళగిరికి దర్శి గర్నమెంట్ హైస్కూల్ హెచ్‌ఎం జి.సత్యనారాయణ, వట్టిచెరుకూరుకు బోపాలెం డైట్ అధ్యాపకులు జి.సత్యనారాయణమూర్తి, అమరావతికి ప్రకాశం జిల్లా కొమరోలు గవర్నమెంట్ హైస్కూల్ హెచ్‌ఎం మేడా శ్రీనివాసరావు, యడ్లపాడుకు వేమూరు గవర్నమెంట్ హైస్కూల్ హెచ్‌ఎం యం.వెంకటనాగరత్నం నియమి తులయ్యారు. కౌన్సెలింగ్‌లో తిరుమలేశ్, ఉర్దూ డిఐ ఖాసిం పాల్గొన్నారు.

యుసిసి ముసాయిదాను ప్రజల ముందుంచాలి

(మొదటి పేజీ తరువాయి)

జీవోలను బలవంతంగా రుద్దకూడదన్నారు. ప్రజలలో అవగాహన కల్పించి మార్పు తీసుకొని రావాల్సిన అవసరం ఉందన్నారు. ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.చిష్టీ మాట్లాడుతూ యుసిసి వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని, 2024 ఎన్నికల దష్ట్యా తెర మీదకు తెచ్చారన్నారు. 21వ లా కమిషన్ అవసరం లేదని చెప్పినా ఈ విధంగా చేయడంలో కచ్చితంగా రాజకీయ దురుద్దేశం దాగి ఉందన్నారు. స్థూలంగా యుసిసి గురించి ఒక ముసాయిదా చట్టాన్ని ప్రజల ముందు ఉంచాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముస్లిమ్ ఐక్యవేదిక నాయకులు అబ్దుల్ కలాం, సిఐటియు నాయకులు షేక్ అబ్దుల్ సలీం, కె.నళినీకాంత్, ఖిద్మత్ బ్యాంకు చైర్మన్ బషీద్, ఆవాజ్ నాయకులు షేక్ సైదా, షేక్ ఇస్మాయిల్, ఐలు నాయకులు శేషగిరిరావు, నజీర్ పాల్గొన్నారు.

డిఇఒ సహా పలువురికి షోకాజ్‌లు

(మొదటి పేజీ తరువాయి)

వెల్దుర్తి జెడ్‌పి పాఠశాల, దాచేపల్లి మండలం గామాలపాడు ఎంపియుపి, కేసనపల్లి ఎంపియుపి, నరసరావుపేట మండలం జొన్నలగడ్డ జెడ్‌పి, ఇస్సపాలెం ఎంపి పాఠశాల, నరసరావుపేట శ్రీ లాల్ బహుదూర్ యుపి, ములకలూరు జెడ్‌పి, కేతుముక్కల అగ్రహారం ఎం జె పి బీసీ వెల్ఫేర్ స్కూల్, నరసరావుపేట ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల స్కూల్, రెంటచింతల ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్, దాచేపలి, కారంపూడి, వెల్దుర్తి కేజీబీవీ పాఠశాలల హెచ్‌ఎంలు నోటీసులు అందుకున్న వారిలో ఉన్నారు.

రోటరీ క్లబ్ పొన్నూరు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

రోటరీ క్లబ్ ద్వారా చేసే సేవ చిరస్థాయిగా నిలిచే విధంగా ఉండాలని రోటరీ3150 డీజీఈ కే శరత్ చౌదరి పేర్కొన్నారు. రోటరీ క్లబ్ పొన్నూరు 2023 -24 సంవత్సరానికి ఆదివారం స్థానిక శుభప్రదం ఫంక్షన్ హాల్‌లో జరిగిన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించిన ఆయన అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ నూతన కార్యవర్గం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా రోటరీ సేవలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని సూచించారు. నూతన అధ్యక్ష కార్యదర్శిలుగా ఎన్నికైన బండారుపల్లి శ్రీనివాసరావు, బోడపాటి రామారావు, ఉపాధ్యక్షునిగా వై వీరయ్య, ఎలెక్ట్ ప్రెసిడెంట్ గా డాక్టర్ జె రవి రాకేష్ దేవ్, జాయింట్ సెక్రెటరీగా కే శ్రీనివాస్ ,ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ ఎన్ బాలకృష్ణ ,ట్రెజరర్ ఎన్ మేఘనాథ్ ,సార్జంట్ ఎటామ్స్ జి ఎం ఎస్ గుప్తా ,క్లబ్ ట్రైనర్ కే రామకష్ణ



,క్లబ్ అడ్వైజర్ పి రవీంద్రనాథ్, క్లబ్ మెంటర్ ఎం ఎం కుద్దూస్, డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ మెంబర్షిప్ రాధాకృష్ణ ,డైరెక్టర్ సర్వీస్ ప్రాజెక్ట్స్ కిషోర్ బాబు ,డైరెక్టర్ రోటరీ ఫౌండేషన్ తోట భాను ప్రసాద్, డైరెక్టర్ యూత్ సర్వీస్ ఎస్ ప్రసాద్ రావు, డైరెక్ట్ ఎండ్ పోలియో ఎస్ రమేష్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇమేజ్ ఆదిశేషు, లిటరసీ అండ్ విన్స్ జి.శివరామకష్ణ ,డైరెక్టర్ వోకేషనల్ సర్వీస్ ఏ వెంకటేశ్వరరావుతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతనంగా సభ్యులుగా చేరిన వారిచే అసిస్టెంట్ గవర్నర్ వై వేణుగోపాల్ ప్రమాణ స్వీకారం చేయించి క్లబ్ లోకి ఆహ్వానించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించరూ...

రన్నింగ్ రూమ్ ఎస్‌సి కాలనీలో దాహం కేకలు





ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని రన్నింగ్ రూమ్ సెంటర్ ఎస్‌సి కాలనీలో గత ఆరు నెలలుగా నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికీ అక్కడ మున్సిపల్ ట్యాపుల ద్వారా వస్తున్న నీటిని గిన్నెల్లో పట్టుకుని బిందెల్లో పోసుకునే పరిస్థితి నెలకొంది. బిందెడు నీటి కోసం గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోందని పేదలు వాపోతున్నారు. పైగా సమయపాలన కూడా లేకపోవడంతో పనులకు వెళ్లే తాము అలసిపోయి ఇంటికి వస్తే నీటి కష్టాలు మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నాయని వాపోతున్నారు. మూడు నెలల క్రితం సమస్యను సిపిఎం నాయకులు స్థానిక సచివాలయం అధికారి దృష్టికి తీసుకెళ్లారు. కొద్దిమేర పనులు కూడా పూర్తయ్యాయి. నూతనంగా పైపులైన్ల కోసం పైపులు కూడా ఏర్పాటు చేశారు. అయితే కనెక్షన్ ఇవ్వకపోవడంతో నేటికీ సమస్య వేధిస్తోంది. సాయంత్రమైతే మున్సిపల్ కుళాయిల దగ్గర పేదలు గుమికూడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి పైపులైన్లకు మెయిన్ లైన్ కనెక్షన్ ఇస్తే సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు కోరుతున్నారు.

గుంటూరులో నేడు టిడిపి బస్సు యాత్ర

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సోమవారం జరగనున్న భవిష్యత్తుకు గ్యారంటీ చైతన్య రథయాత్ర జయప్రదం చేయాలని టిడిపి తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి మహమ్మద్ నసీర్ అహ్మద్ కోరారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుంటూరులో కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి ఏటుకూరు రోడ్డు వరకు యాత్రజరగుతుందన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ అభిమానులు అందరు పాల్గొని విజయవంతం చేయవలిసిందిగా కోరారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, చిట్టిబాబు,రాజా మాస్టర్, కార్పొరేటర్లు యాళ్ళావుల అశోక్, ముప్పవరపు భారతి తదితరుల పాల్గొన్నారు.

మురుగు కాలువను కప్పేసిన పిచ్చిచెట్లు



ప్రజాశక్తి-తాడేపల్లి

15వ వార్డులోని కొండ పైభాగంలో ఎ.వెంకటరెడ్డి ఇంటి వద్ద ఉన్న మురుగు కాలువను పిచ్చి చెట్లు కమ్మేశాయి. ఆ ప్రాంతంలో మురుగ నిలబడి దుర్వాసన వెదజల్లుతోంది. కాలువను చెట్లు పూర్తిగా కప్పేయడంతో విష కీటకాలు వచ్చే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకుని మురుగు కాలు వపై ఉన్న పిచ్చిచెట్లను తొలగిం చాలని కోరారు.



చర్చికి గ్రానైట్ రాయి అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని 13వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న బాలయేసు చర్చికి నారా లోకేష్ ద్వారా ఆ పార్టీ కార్యకర్తలు ఆదివారం రూ.5 లక్షలు విలువ చేసే గ్రానైట్ రాయిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు జంగాల సాంబశివరావు, ఎ.భాగ్యారావు, కుమార్, బి.రామకృష్ణ, బాబావలి తదితరులు పాల్గొన్నారు.

తక్షణం ఎన్నికలు జరపండి

ఆర్యవైశ్య మహాసభ ఆత్మీయ సమావేశంలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లా ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక కొరిటపాడులోని కొమ్మినేని ఫంక్షన్ హాలులో జరిగింది. మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ మాట్లాడుతూ రానున్న ఎన్నికలు కురుక్షేత్రం మాదిరిగా జరగనున్నాయని, ఈ ఎన్నికల్లో ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని ఆశిస్తున్నానని తెలిపారు. వైశ్యులు ఏ పార్టీ తరపున పోటీ చేసినా తాను వచ్చి ప్రచారం చేస్తానని తెలిపారు. ఆర్యవైశ్య మహాసభ ఎన్నికలను త్వరగా నిర్వహించాలని విజప్తి చేశారు. రోశయ్య తర్వాత ఆర్యవైశ్య మహాసభ కనుమరుగైందన్నారు. ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులుగా చేసేవారు వారున్న పార్టీకి రాజీనామా చేసి రావాలన్నారు. టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు డుండి రాకేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్యవైశ్యులపై పెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నాయన్నారు. పల్నాడు, గుంటూరు జిల్లాల్లో వైశ్యులపై దాడులు జరిగాయన్నారు. చివరికి దేవాలయాలకు సైతం రాజకీయ రంగులు పులుముతున్నారని తెలిపారు. కన్యకాపరమేశ్వరి ఆలయం ఎంతో చరిత్ర ఉందని అక్కడ కూడా అధికార పార్టీ రాజకీయం చేస్తుందన్నారు. దేవాలయాల్లో 20 శాతం ఇతర కులాల వారికి పదవులు ఇవ్వాలని ప్రభుత్వం చూస్తుందన్నారు. ఆర్యవైశ్యుల దేవాలయాలను ప్రభుత్వంలో విలీనం చేసుకోవడానికి వ్యతిరేకంగా పోరాడుతామన్నారు. బాపట్ల జిల్లాకు కొణిజేటి రోశయ్య పేరు పెట్టాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో రాష్ట్ర నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ముక్కాల ద్వారకానాథ్ పనితీరు సరిగా లేదన్నారు. మహాసభను ఆయన నిర్వీర్యం చేశారని వెంటనే ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ద్వారకానాథ్‌పై అవినీతి ఆరోపణలు చేశారు. వైసిపికి అనుకూలంగామారిన ద్వారకానాథ్‌కు చందాలు ఇవ్వద్దని కోరారు. కదిరి మాజీ ఎమ్మెల్యే పార్థసారధి మాట్లాడుతూ

ఆర్యవైశ్య మహాసభ వల్లే తనకు ఎమ్మెల్యే సీటు వచ్చిందన్నారు. రాజకీయాలలో ఆర్యవైశ్యులు మాత్రమే నిజాయితీగా ఉంటారని, దమ్ముంటే ఇతర కులాల వాళ్ళు నిజాయితీగా ఉన్నామని చెప్పగలరా అని ప్రశ్నించారు.

వయసుతోపాటు ఊపిరితిత్తుల్లో మార్పులు



మాట్లాడుతున్న డాక్టర్ తేజ

ప్రజాశక్తి-గుంటూరు

మానవుడి వయస్సుతోపాటు ఊపిరితిత్తుల్లో మార్పులు సంభవిస్తాయని,శ్వాశకోశాలను పటిష్టపరిచే ప్రాణాయామం లాంటి వ్యాయామాలు చేయటం మంచిదని చెస్ట్ ఫిజీషియన్ డాక్టర్ ఎస్.తేజ పేర్కొన్నారు. అవగాహన ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ తేజ మాట్లాడుతూ శ్వాసకోశ వ్యాధులతో ముఖ్యంగా ఎదురవుతున్న వాటిలో సిఒపిడి, లంగ్ క్యాన్సర్, టి.బి, బ్రాంకైటీస్, నిమోనియా ప్రదానం అని, మనకు రెండు మూత్రపిండాలు, రెండు ఊపిరితిత్తులు ఉంటాయని, ఊపిరితిత్తులలో కొంతభాగం దెబ్బతిన్నా మనకు తెలియదని అన్నారు. ఊపిరితిత్తులు దెబ్బతింటే ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉందన్నారు.

ఊపిరితిత్తుల సమస్యలలో దాదాపు 70 శాతం గాలిగొట్టాలలో వస్తున్నాయని తెలిపారు. మనకు ఆస్తమా సమస్యకు ముఖ్యంగా రెండు రకాలు వాడతారని, ఇన్‌హేలర్స్, రోటాక్యాప్స్ అని రెండింటిలో ఒకే మందు ఉప్పటికీ వాడే విధానం తెలిస్తే ఇన్‌హేలర్స్ మంచిదని తెలిపారు. ఇన్‌హేలర్ విత్ స్పైసర్ అయితే మరీ ప్రభావితంగా పనిచేస్తాయన్నారు. ఈ శ్వాసకోశ సమస్యలు వాతావరణ కాలుష్యం వల్ల వస్తాయన్నారు. కొంత మందికి పూల వాసన, సాంబ్రాణి, అగరబత్తి, మస్కిటో కాయిల్స్ వల్ల కూడా ఆస్తమా వచ్చే అవకాశం ఉందని, మనం నివశించే గదులకు వెంటిలేషన్ సరిగా లేకపోవటం వల్ల కూడా ఆస్తమా వస్తుందని వివరించారు. లంగ్ క్యాన్సర్ జన్యుపరంగా రాదని, వాతావరణంలో పొల్యూషన్, ఆహార అలవాట్లు, దురవ్యసనాలు కూడా కారణమన్నారు. ఊపిరితిత్తులు కెపాసిటీ పెరగటానికి ప్రాణామాయం చేయటం, రెస్పిరోమీటర్ వాడటం ద్వారా ప్రయత్నం చేయొచ్చన్నారు. టి.బి వ్యాధి గురించి మాట్లాడుతూ ఈ వ్యాధి మామూలుగా ప్రాణాంతకం కాదని, ప్రస్తుతం చాలా మందులు వచ్చాయని, కాకపోతే డాక్టర్ సూచనల ప్రకారం నిర్ణీత సమయం ఒక కోర్సు వాడాలని, లేకుంటే వ్యాధి తిరగబడుతుందన్నారు. ఈ వ్యాధి అంటువ్యాధి అని, దీనికి కేంద్రం మందులు ఇస్తుందన్నారు. ఈ వ్యాధికి కోర్సు వాడేలోపు తగ్గినట్లుగా అనిపిస్తుందని, కానీ తగ్గిందనే భావంతో పూర్తి కోర్సు వాడటం తప్పనిసరి అని తెలిపి, తదుపరి అవగాహన సభ్యులు అడిగిని సందేహాలు నివృత్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి



ప్రజాశక్తి - మాచర్ల

పట్టణం మార్కెట్ యార్డ్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన మంద రవికుమార్ (35) మృతి చెందాడు. లారీ డ్రైవర్ గా పని చేస్తూ స్థానిక బస్టాండ్ సమీపంలో నివాసం ఉంటున్న రవి కుమార్‌మోటార్ సైకిల్ పై రాయవరం జంక్షన్ వైపు వెళుతుండగా ముందుగా వెళుతున్న డీసీఎం వాహనాన్ని ఢీ కొని సంఘటన స్థలంలోనే రవికుమార్ చనిపోయాడు. తీవ్ర గాయాల పాలైన రవి కుమారుని ఆస్పత్రికి తీసుకువెళ్లేటప్పటికే చనిపోయాడు రవి కుమార్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఆది వారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయండి

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

మామిళ్ళపల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు దొనే సునీల్ పై అదే గ్రామానికి చెందిన గోపిరెడ్డి నరేంద్ర , అతని అనుచరులు దాడి చేయడంపై ప్రముఖ న్యాయవాది ఆంధ్రప్రదేశ్ మాల యువసేన రాష్ట్ర అధ్యక్షులు పొందుగల చైతన్య ఖండించారు. ధోని సునీల్, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పొన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్న నేపథ్యంలో చైతన్య, మాల యువసేన సభ్యులు, సునీల్‌నుపరామర్శించారు. అనంతరం చైతన్య మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై అగ్రవర్ణాలు దాడులు కొనసాగిస్తున్నారని ఆరోపించారు సునీల్ పై దాడి చేసిన వారిని ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఫిరంగిపురం

మండల కేంద్రమైన ఫిరంగిపురం సెయింట్ పాల్స్ హై స్కూల్ ఆవరణలో శంకర్ కంటి వైద్యశాల వారి సౌజన్యంతో తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ ఆధ్వర్యంలో దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 75 వ జయంతి సందర్భంగా ఉచిత నేత్ర మెగా వైద్య శిబిరం ఆదివారం జరిగింది. ఫిరంగిపురం మేడికొండూరు రెండు మండలాలకు సంబంధించి గ్రామాల నుండి సుమారు 300 మంది హాజరయ్యా రూ వీరికి వైద్య పరీక్షలు నిర్వహించగా 70 మందికి కంటి శుక్లములు ఉచితంగా త్వరలో తీస్తామని, 80 మందికి ఉచితంగా మందులు వైద్యులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేడికొండూరు ఎంపీపీ మన్నవ స్వప్న, ఫిరంగిపురం ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్, జడ్పిటిసి రేణమ్మ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మార్పుల శివరామిరెడ్డి, వైస్ ఎంపీపీ 2 గుమ్మడి చంద్రం, నాగరాజు, చిట్టా అంజిరెడ్డి, జేమ్స్, శ్రీనివాసరెడ్డి, చిన్నయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

విజయవాడ హెల్ప్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పట్టణంలోని 22వ వార్డులో ఆదివారం ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగాల సాంబశివరావు, డి.సుందరరావుయాదవ్, హరినాథ్, ఇట్టా భాస్కర్, గంధం సురేష్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న ఇళ్లకు పూర్తి నష్టపరిహారమివ్వండి

చేతులు దులుపు కోవాలని చూస్తే చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీని ముట్టడిస్తాం : సిపిఎం నాయకులు

ప్రజాశక్తి–దాచేపల్లి

నిబంధనలకు విరుద్ధంగా చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీకి చెందిన మైనింగ్ పెడగార్లపాడు గ్రామ శివారులో జరుగుతుండటంతో స్థానిక బీసీ కాలనీలో ఇళ్ల గోడలు బీటలు వారి దెబ్బతినడం తెలిసిందే. ఈ విషయమై కాలనీ వాసులు సిపిఎం ఆధ్వర్యంలో నరసరావుపేట కలెక్టరేట్ వద్దకు వెళ్లి ఇటీవల ఆందోళన నిర్వహించి ఈ విషయం తెలియజేయడం కూడా జరిగింది. ఈ క్రమంలో శనివారం రాత్రి చెట్టి నాడు సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం కొన్ని ట్రాక్టర్లలో ఇంటికి పది సిమెంట్ బస్తాలు చొప్పున తీసుకు వచ్చి, వీటితో పాటు తలా అర ట్రక్కు ఇసుక ఇస్తామని, ఇవి తీసుకొని కాలనీ వాసులు పేపర్లపై సంతకాలు చేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం చెప్పిన దానికి కాలనీ వాసులందరూ తిరస్కరించారు. 'మీ వల్ల పాడైన ఇంటికి బదులు ఇంటిని నిర్మించాలి' అని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో దాచేపల్లిలోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశం జరిగింది. సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఫ్యాక్టరీ యాజమాన్యం దొంగ పద్ధతులలో, అరకొరా ఇచ్చి చేతులు దులుపు కోవాలని చూస్తే ఫ్యాక్టరీ ముట్టడిస్తామని హెచ్చరించారు. దెబ్బతిన్న ఇళ్లకు పూర్తి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.గత ఎన్నికల్లో నాలుగు రూపాయలు ఖర్చు చేసి తానే సర్పం చ్ ని అనుకునే వ్యక్తి తనకు సంబంధం లేని విషయంలో ఫ్యాక్టరీ యాజమాన్యం కొమ్ము



సమావేశంలో పాల్గొన్న సిపిఎం నాయకులు

కాసి, ప్రజలను బెదిరించాలనుకుంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు గోపాలరావు, అంజనేయరాజు, కె.సాంబయ్య, జె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇన్నర్ వీల్ క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శుల ప్రమాణస్వీకారం



ప్రజాశక్తి–చిలకలూరిపేట

చిలకలూరిపేట ఇన్నర్ వీల్ క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శిగా ఇందిర మారెళ్ల, రాయిని హరితలు ప్రమాణం స్వీకారం చేశారు. స్థానిక పండరీపురంలోని ఇన్నర్ వీల్ క్లబ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సంస్థ నిర్మాణాకర్త డాక్టర్ కంది మళ్ల జయమ్మ వారితో ప్రమాణ స్వీకారం చేయిం చారు. ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది.(ఐ.డబ్ల్యు.) ఈ సందర్భంగా ఇందిర,హరితలను పలువురు మహిళలు అభి నందించారు. గత సంవ త్సరం ఇన్నర్ వీల్ క్లబ్ వారి ఆధ్వ ర్యంలో జరిగిన సేవా కార్య క్రమాల ను గత సంవత్సర ప్రెసిడెంట్ గా పని చేసిన రాజ్యలక్ష్మి వివరించారు. డాక్టర్స్ డే సందర్భంగా సీనియర్ డాక్టర్లు డాక్టర్ జయమ్మ, డాక్టర్ కొమ్మినేని వీర శంకర్రావు, డాక్టర్ ఎం.రమేష్ బాబులను ఘనంగా సన్మానించారు. అనంతరం కారుమంచి శివరావు భార్య సరళా దేవి జ్ఞాపకార్థం రూ.25 వేలు, డాక్టర్ వీర శంకరరావు 10 వేలను మొక్క లు నాటే కార్యక్రమానికి అందజేశారు. యలమంచిలి నవీన రూ.10,116ను కుట్టు మిషన్ పంపి ణీకి ఇన్నర్ వీల్ క్లబ్ కు విరాళంగా అందజేశారు. ఇన్నర్ వీల్ ఆధ్వర్యంలో ఇద్దరు పిల్లలకు పది వేల రూపాయల స్కాలర్ షిప్‌ను అధ్యక్ష,కార్యదర్శులు అందజేశారు.



వాసవి క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులకు సన్మానం

ప్రజాశక్తి - వినుకొండ

ప్రపంచ వైద్యుల దినోత్సవ సందర్భంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ సెక్రటరీ కజ్జాయం విజయలక్ష్మి ఆధ్వర్యంలో వినుకొండ పట్టణంలోని నిమ్స్24 హాస్పటల్‌లో ఆదివారం ఘనంగా డాక్టర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఎముకల వైద్యులందరినీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో వాసవి క్లబ్ ఎప్పుడూ ముందుంటుందని అలాగే వైద్యుల్ని కూడా సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందని తెలియజేశారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మాట్లాడుతూ డాక్టర్ బిపి రాయి జయంతిని పురస్కరించుకుని డాక్టర్ నిర్వహించడం జరుగుతుందని అలాగే అమ్మ జన్మనిస్తే డాక్టర్ పునర్జన్మ ప్రసాదిస్తారని తెలియజేశారు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కమిటీ చైర్మన్ మండవ వెంకట కిరణ్ కుమార్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గజవల్లి నాగ పవన్ కుమార్ జోన్ చైర్మన్ పేరూరు కష్ణ వాసవి యూత్ అధ్యక్షులు అరవింద్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ మండవ హైమావతి జోన్ చైర్మన్ శైలజ ఉషారాణి, బెల్లంకొండ ప్రసాద్ ,జ్యోతి, గుడిపాటి లక్ష్మీ రాజ్యం, రామడుగు లక్ష్మి, రాము, చందలూరు రవి, బ్రహ్మం వాసవి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళలు ఉద్యమిస్తేనే సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి–చిలకలూరిపేట

మహిళలు ప్రస్తుతానికి అనేక సమస్యలను ఎదు ర్కొంటున్నారని, వాటిపై పోరాడి సమస్యలను పరిష్క రించుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సం ఘం (ఐద్వా) రాష్ట్ర నాయకులు గద్దె ఉమాశ్రీ అన్నారు. స్థానిక పండరీపురంలోని ఏలూ రు సిద్దయ్య విజ్ఞాన కేం ద్రంలో ఆదివారం జరిగిన మహిళా సంఘ సమా వేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ రోజు రోజుకు మహిళలపై అగత్యాలు, దాడులు,హింసలు పెరిగి పోతున్నాయన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గద్దె ఉమాశ్రీ

అత్యాచారం చేసిన వారికి వెంటనే శిక్షలు పడటం లేదని, విచారణ, రిపోర్టుల పేరిట సంవత్సరాల తరబడి కాల యాపన చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గంజాయి,మద్యం అమ్మ కాలు గురించి ఆమె ప్రస్తా వించారు. గంజాయి మత్తులో యువత పక్కదారి పడు తూ వారి భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని అన్నారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయని, విశాఖ ఉక్కు , విద్యుత్తు బిల్లులు మొదలైన అంశాలపై ఆమె మాట్లాడారు. సమా జంలో మహిళలకు జరిగే అన్యా యాలను వ్యతి రేకంగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానా లకు వ్యతిరేకంగా పోరాడాలని పిలువు నిచ్చారు. మహిళలు ఉద్యమిస్తేనే అనేక రకాల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. పి. భారతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్య దర్శి పేరుబో యిన వెంకటేశ్వర్లు, ఎం.ఏసమ్మ, దుర్గ, సంతోష్, శివపార్వతి పాల్గొన్నారు.

తిరుమల ఇంజినీరింగ్ కళాశాలకు అరుదైన గుర్తింపు

నాక్ 'ఎ'ప్లస్, ఎన్‌బిఎ, పదేళ్ల పాటు అటానమస్ హోదా

ప్రజాశక్తి–పల్నాడు జిల్లా

విద్య ద్వారానే కుటుంబ, ప్రాంత, రాష్ట్రాభి వృద్ధి జరుగుతుందని గ్రహించి పల్నాడు ప్రాంతంలో ఉన్న రైతాంగ కుటుంబానికి చెందిన పిల్లల భవిష్యత్ దృష్ట్యా తిరుమల ఇంజనీరింగ్ కళాశాల స్థాపించడం జరిగిందని కళాశాల చైర్మన్, వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. ఎంతో అరుదుగా లభించే నాక్ ఏ ప్లస్, ఎన్.బి.ఎ ,10 ఏళ్ల అటానమస్ హోదా తిరుమల ఇంజనీరింగ్ కళాశాలకు లభించడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జొన్నలగడ్డ పరిధిలోని కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ కళాశాలకు అతి తక్కువ సమయంలో ఆయా హోదాలు లభించడం పట్ల కళాశాల నిర్వహణపై తమ బాధ్యత మరింత పెరిగిందన్నారు.ఈ హోదా వల్ల రానున్న కాలంలో తమ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు అధికంగా వస్తాయన్నారు. తమ కళాశాల కు చెందిన ఓ విద్యార్థికి 17 సంస్థలో ఉద్యోగం వచ్చిందని చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ మాట్లాడుతూ తిరుమల కళాశాల లో చదివితే ఉద్యోగం ఖాయం అనే నానుడి పల్నాడు ప్రాంతంలో నెలకొందన్నారు.





మాట్లాడుతున్న ఎమ్మెల్యే, కళాశాల చైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు, ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులో కళాశాల సిబ్బంది

కళాశాల అభివృద్ధిలో ఫౌండర్ ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి నారాయణ పాత్ర ఎంతో కీలకమన్నారు. తమ కళాశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని నారాయణ అన్నారు. తమ కళాశాలలో బహుళజాతి కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో 603 ఉద్యోగాలు వచ్చాయన్నారు. వీటిలో బిగ్ వర్క్స్ కంపెనీ నందు అత్యధికంగా రూ 29 లక్షల ప్యాకేజీ తో 10 మంది విద్యార్థులు రూ .26 లక్షల ప్యాకేజీతో 7 గురు విద్యార్థినీ విద్యార్థులు, 45 టాప్ సాఫ్ట్‌వేర్ కంపెనీల లో విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలి

మున్సిపల్ అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి–పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలో తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు ఏమైనా మరమ్మత్తులు ఉంటే పూర్తి చేసి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆదివారం రావిపాడు సమీపంలో గల శాంతినగర్ లోని నరసరావుపేట పురపాలక సంఘ సంబంధించిన తాగునీటి సరఫరా కేంద్రాన్ని మున్సిపల్ అధికారులతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓవర్ హెడ్ ట్యాంక్ ల ద్వారా సరఫరా అయ్యే నీరు చివరి గహాల వారికి సక్రమంగా సరఫరా కావడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని అటువంటి ప్రాంతాలకు ట్యాంకర్ల నీటి సరఫరా చేసి సమస్య పరిష్కారానికి కషి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా మంచి నీటి చెరువు నుండి పట్టణంలోకి నీరు సరఫరా అయ్యే పైప్ లైన్ ల మరమ్మతులు ఎప్పటికప్పుడు త్వరితగతిన చేపట్టి నీటి సరఫరాకు అంతరాయం కలిగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు వైసిపి నాయకులు పాల్గొన్నారు.



శాంతి నగర్ లోని మంచినీటి సరఫరా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నాగార్జున కొండలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి–విజయపురిసౌత్

ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండ ను ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శించారు.స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండ కు నాగసిరి,శాంతి సిరి లాంచీలలో కొండకు వెళ్లిన పర్యాటకులు అక్కడ మ్యూజియంలో ఉన్న బుద్ధిని ప్రతిమలు,రాతి పనిముట్లు, మట్టి కుండలు,9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం,అశ్వమేధ శాల, స్నానాల గట్టు చూసి తన్మయం చెందారు. అనంతరం అనుపు లోని యాంపి స్టేడియం, అశ్వమేద యగ్నశాల, శ్రీ రంగనాథస్వామి దేవాలయం, తదనంతరం 60 అడుగుల ఎత్తునుండి జాలువారే ఎత్తిపోతల జలపాతాన్ని



తిలకించారు.ఆదివారం లాంచీల ద్వారా పర్యాటక శాఖ కు 37 వేల రూపాయల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

తరలిస్తే జీవనోపాధికి దూరమే

- ఎక్కడున్న వారికి అక్కడే స్థలాలకు పట్టాలివ్వాలి
- పలు ప్రాంతాల్లో సిపిఎం నాయకుల పర్యటన
- 5న ధర్నా జయప్రదానికి పిలుపు


పేదలతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, ఇతర నాయకులు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని అమరారెడ్డి నగర్, యానాదుల కాలనీ తదితర ప్రాంతాల్లో ఇప్పుడు నివాసముంటున్న ఇళ్లకే పట్టాలివ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి స్థానిక సిపిఎం బృందం ఆ ప్రాంతంలో పర్యటించి స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ 40 ఏళ్లుగా ఇక్కడ ఉంటున్న పేదలకు ఇక్కడే పట్టాలివ్వాలని కోరారు. ఇరిగేషన్ స్థలాలకు పట్టాలివ్వడం సాధ్యం కాదని ప్రభుత్వం చెప్పే మాటలు సరైనది కాదన్నారు. అలా అనుకుంటే ప్రభుత్వం వాళ్లను అక్కడే నివాస ఉండేలా నివాస హక్కు పత్రాలివ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రజలు నివశిస్తున్న ప్రాంతంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు పంచాయతీ నుంచి కార్పొరేషన్ వరకు పాలనలో ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధులు కల్పించారని చెప్పారు. విజయవాడ నగరంతో పాటు పెద్దఎత్తున బైపాస్ రోడ్డు వైపు అపారుమెంట్లు వచ్చి పేదలకు జీవనోపాధి దొరుకుతుందని చెప్పారు. ఇక్కడ నుంచి పనులకు వెళ్లడం వారికి సులభంగా ఉంటుందన్నారు. పేదల జీవన చక్రం సజావుగా సాగాలంటే ఇప్పుడుంటున్న స్థలాలకే పట్టాలివ్వాలని కోరారు. ఆ మేరకు ఈ నెల 5వ తేదీ బుధవారం కృష్ణుని గుడి వద్ద సచివాలయం ముందు జరిగే ధర్నాకు బాధితులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

సిపిఎం పట్టణ కమిటీ తీర్మానం

ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న పేదలందరికీ వారు నివశిస్తున్న చోటే స్థలాలకు పట్టాలివ్వాలని సిపిఎం పట్టణ కమిటీ తీర్మానించింది. గాదె సుబ్బారెడ్డి అధ్యక్షతన ఆదివారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన ప్రతిఒక్కరికీ రెండు సెంట్ల ఇంటిస్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు సెంట్ల స్థలంలో పేదల తమ జీవనం గడిచే విధంగా కోళ్లు, గేదెల పెంపకం వంటి చేసుకుంటారని సూచించారు. సెంటు స్థలంలో నలుగురు సభ్యులున్న కుటుంబం ఎలా జీవిస్తుందని ప్రశ్నించారు. తాడేపల్లిలో అనేక పేటల్లో సిపిఎం బృందాలు జరిపిన సర్వేలో తాము ఎక్కడ నివాసం ఉంటే అక్కడే పట్టాలివ్వాలనే డిమాండ్ వినిపిస్తోందన్నారు. రైల్వే స్థలాల్లో నివాసముంటున్న వారికి కూడా రెండు సెంట్ల స్థలం కేటాయించాలని కోరారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు ప్రజలు కట్టలేక ఆందోళన చెందుతున్నారని, వాటిని తగ్గించాలని కోరారు. కార్యక్రమాల్లో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, కె.కరుణాకరరావు, వి.దుర్గారాలు, డివి భాస్కరరెడ్డి, ఎస్.ముత్యాలరావు, సుబ్బారావు, ఎల్.ఆచారి, డి.యోహాన్, పి.గిరిజ, ఎం.శ్రీనివాసరెడ్డి, బర్నబాసు పాల్గొన్నారు.

పిల్లల చదువు దెబ్బతింటుంది

బి.రమేష్, ఎం.నాగమల్లేశ్వరి




అమరారెడ్డి నగర్ నుంచి ఇద్దరు పిల్లలను స్థానికంగా ఉన్న పాఠశాలలో చేర్చాం. రాజధానిలో ఎక్కడో మారుమూల ప్లాటు ఇచ్చారు. మేము నివశిస్తున్న ఇళ్లకే పట్టాలివ్వాలి. ఊర్లకు దూరంగా ఎక్కడో అడవిలో పడేసి పట్టాలిచ్చారు. అక్కడ ఉండలేని పరిస్థితి.

కోర్టులో ఓడిపోతే నష్టపోవాలి

వి.సుబ్బారావు, కె.పార్వతి



మాకిచ్చిన పట్టాలో కోర్టు తీర్పుకు అనుగుణంగా మూడో పార్టీకి అధికారాలు ఉంటాయని చెప్పారు. కోర్టు తీర్పు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వస్తే మేం నష్టపోవాల్సిందేనా? పిడబ్ల్యూడి ఇరిగేషన్ స్థలంలో పట్టాలివ్వకూడదని అధికారులు చెబుతున్నారు. పట్టాలివ్వకపోతే హక్కు పత్రాలైనా ఇప్పించాలి.


దిష్టి బొమ్మను దహనం చేస్తున్న నాయకులు

లోకేశ్ దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - మంగళగిరి

ఆప్కో రాష్ట్ర చైర్మన్ గంజి చిరంజీవిపై స్థానిక టిడిపి నేతలు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం మంగళగిరి అంబేద్కర్ సెంటర్లో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా స్థానిక చేనేత నాయకులు మాట్లాడుతూ లోకేశ్ చేనేతను దత్తత తీసుకుంటున్నాను అన్న వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని అన్నారు. చేనేత వర్గాల మధ్య చిచ్చు పెట్టాలని టిడిపి చూస్తోందని, మంగళగిరిలో లోకేశ్ మరోసారి ఓడిపోవడం ఖాయమని అన్నారు.

5న దుగ్గిరాలలో చైతన్య యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-మంగళగిరి

'భవిష్యత్‌కు గ్యారెంటీ' జన చైతన్య యాత్ర (బస్సు యాత్ర)లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని టిడిపి మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో ఆదివారం ఆయన సమావేశమై ఏర్పాట్లు, రూట్ మ్యాప్‌ను ఖరారు చేశారు. బుధవారం ఉదయం దుగ్గిరాలలో యాత్రను ప్రారంభిస్తామని, దుగ్గిరాల మార్కెట్ యార్డులో పసుపు రైతులతో సమావేశం ఉంటుందని అన్నారు. అనంతరం రేవేంద్రపాడు బిడ్జి పరిశీలన, మంగళగిరిలో ఎపిఐఐసి కార్యాలయం, సాఫ్ట్‌వేర్ కంపెనీలు, టిడ్కో గృహాల వద్ద సెల్ఫీ ఛాలెంజ్, టిడ్కో గృహాల వద్ద రచ్చబండ కార్యక్రమాలు ఉంటాయన్నారు. సమావేశంలో నాయకులు పి.శ్రీనివాసరావు, డి.రాజు, టి.పార్థసారథి, వి.వెంకట్రావు, ఎ.సుబ్బారావు, కె.శ్రీఅనిత, కె.శేషు, షేక్ రియాజ్, టి.అశోక్ యాదవ్, ఎం.వెంకట్రావు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజల్వన చేస్తున్న డాక్టర్ ప్రభావతి తదితరులు

రోగుల సంతృప్తే లక్ష్యంగా పనిచేయండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రోగుల సంతృప్తి చెందడమే లక్ష్యంగా వైద్యులు కృషి చేయాలని ప్రముఖ గైనకాలజిస్టు, జిజిహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.ప్రభావతి అన్నారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ ఆస్పత్రి 2వ వార్షికోత్సవం ఆదివారం స్థానిక ఎస్‌విఎన్ కాలనీలోని ఒక హోటల్‌లో జరిగింది. ఐవిఎఫ్ ద్వారా గర్భం దాల్చిన జంటలను సత్కరించారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్‌లో ఐవిఎఫ్ ద్వారా గర్భం దాల్చిన వారిని సత్కరించారు. సామూహిక సీమంతం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభావతి మాట్లాడుతూ ప్రతి ఆరుగురిలో ఒకరికి సంతానలేమి సమస్య ఉందన్నారు. పెళ్లైన ఒక జంట ఏడాది తర్వాత కూడా గర్భం దాల్చలేకపోతే ఫెర్టిలిటీ స్పెషలిస్టును సంప్రదించడం అవసరమన్నారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ ఆస్పత్రిలో ఐవిఎఫ్ ద్వారా 75శాతం విజయం సాధించారని భవిష్యత్తులో నూరుశాతం విజయం సాధించాలని ఆకాక్షించారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ గుంటూరు కన్సల్టెంట్ డాక్టర్ వి.రమ్య మాట్లాడుతూ మహిళలలో వయస్సు పెరిగే కొద్దీ వారిలో సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గుతుందన్నారు. ఐవిఎం, ఎంబ్రియోగ్లూ, మైక్రోఫ్లూయిడిక్స్ తదితర అధునాతన సంతానోత్పత్తి చికిత్సలతో ఎక్కువ మంది తల్లిదండ్రులు అయ్యే అవకాశం తమసంస్థ కల్పిస్తుందన్నారు. అనంతరం శ్రావణి హాస్పిటల్ గైనకాలజిస్టు డాక్టర్ అపర్ణ, డాక్టర్ నిర్మల, మైథిలీ మాట్లాడారు.

రాజధానిని నిర్వీర్యం చేసిన జగన్

అమరావతి మహిళలతో పోలీసుల అమానుష ప్రవర్తన - యరపతినేని, బ్రహ్మారెడ్డి విమర్శలు

ప్రజాశక్తి - గుంటూరుజిల్లా ప్రతినిధి

రాజధాని అమరావతిని నిర్వీర్యం చేసిన సిఎం జగన్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేశారని టిడిపి మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి విమర్శించారు. గుంటూరులో ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ మూడు రాజధానుల విధానం వల్ల దేశంలో ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని అంటే ఎదో ఎవ్వరూ చెప్పలేని పరిస్థితి ఏర్పండిందన్నారు. రాజధానికి కూడా కులం అంటగట్టి అమరావతిని దారుణంగా దెబ్బతీశారని అన్నారు. ఎస్ఐ నుంచి ఎస్పీ వరకు అమరావతి మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తించిన వారితోనే మహిళల కాళ్లు పట్టిస్తామన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను జగన్ దారుణంగా దెబ్బతీశారన్నారు. పల్నాడులో పోలీస్ స్టేషన్లు వైసిపి కార్యాలయాలుగా మారాయని, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి క్యాష్ మహేష్‌రెడ్డిగా మారాడని విమర్శించారు. అక్రమ మైనింగ్ గుంతల్లోపడి ఎనిమిది మంది మృతి చెందారని గురజాల నియోజకవర్గంలో 33 చోట్ల అక్రమ మైనింగ్ జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాసు మహేష్‌రెడ్డి మూడువేల ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేశారని, ఆ భూములను బ్యాంకుల్లో తాకట్టుపెట్టి రూ.వందలకోట్లు తీసుకున్నారని ఆరోపించారు. కొంతమంది అధికారుల ప్రవర్తనతో ఐఎఎస్, ఐపిఎస్‌ల ప్రతిష్ట దిగజారిపోయిందన్నారు. పల్నాడులో రోజుకు లారీ తెలంగాణ మద్యం గురజాల నియోజకవర్గానికి తీసుకొచ్చి అమ్ముతున్నారు. నాలుగేళ్లలో గురజాల ఎమ్మెల్యే, ఇతర నాయకులు రూ. 500 కోట్లు సంపాదించారని తెలిపారు. రంగురాళ్ల అమ్మకంలో వైసిపి నేతల మధ్య వివాదంతో మాడుగులలో బ్రహ్మయ్యను హత్య చేశారని తెలిపారు. ఫారెస్ట్ అధికారులపై వైసిపి రంగురాళ్ల మాఫియా దాడి చేసిందన్నారు. దైద పుణ్యక్షేత్రంలో గంజాయి సాగు చేస్తున్నారని, పేకాట క్లబ్బులు, ఊరికో 20 బెల్టుషాపులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఎక్సైజ్ అధికారి కొండారెడ్డి దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని టిడిపి అధికారంలోకి రాగానే ఆయన సంగతి చూస్తామని అన్నారు. పల్నాడు జిల్లా ఎస్‌పి వైసిపి కార్యకర్తగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. లోకేష్‌పై వైసిపి పేటిఎం బ్యాచ్ అవాకులు, చవాకులు పేల్తున్నారని త్వరలో పల్నాడులో లోకేశ్ యువగళం పాదయాత్ర ఉంటుందని అన్నారు.

రేషన్ ఇప్పించండి మహాప్రభో

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందని లబ్దిదారులు ఎవరైనా ఉంటే తక్షణమే వారికి అన్ని విధాలా సహకరిస్తామని గృహ సారధులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బందిని ఇంటికి పంపుతుంది. గత నెలలో అమరారెడ్డినగర్, యానాదుల కాలనీ ప్రాంతాల్లో 600 మందికి రేషన్ అందలేదు. ఈ నెలలోనైనా అందుతాయో లేదోననే ఆందోళన నెలకొంది. ఈ నెల రేషన్ మొదలు పెట్టారు. గత నెల రేషన్ గురించి అడిగితే పొంతన లేని సమాధానాలు సంబంధిత డీలర్లు చెబుతున్నారు. తమకు అందాల్సిన రేషన్‌ను ఇప్పటికైనా అందించాలని స్థానికులు కోరుతున్నారు.



ఈబీ హాస్పిటల్లో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

రక్షణ సైన్యం ఇవాంజెలిన్ బూత్ బాపట్ల ఆధ్వర్యంలో రక్షణ సైన్యం స్థాపించి 158 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం పొన్నూరు ఈబి హాస్పిటల్లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 100 మందికి బిపి, షుగర్, రక్త పరీక్షలు, గర్భిణులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్యశాల అడ్మినిస్ట్రేటర్ దంపతులు కె.కనకరత్నం, రాజశ్రీలు మాట్లాడుతూ 158 ఏళ్లుగా 138 దేశాల్లో విద్య వైద్యం సామాజిక సాంఘిక సేవా కార్యక్రమాలను నిరంతరంగా రక్షణ సైన్యం సంస్థ కొనసాగిస్తోందన్నారు సైన్యం స్థాపితులైన జనరల్ విలియం బూత్, కేథరిన్ బూత్‌లను స్మరించుకుంటూ వారు చూపిన బాటలో ముందుకు కొనసాగించాలని అన్నారు. తొలుత సాల్వేషన్ ఆర్మీ జెండాను ఎడి కె.కనకరత్నం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ రక్షణ సైన్యం ఆఫీసర్లు కెప్టెన్ మాణిక్యరావు దంపతులు డాక్టర్లు కళ్యాణి, లావణ్య, రాజ్‌కుమార్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన



అప్పాపురంలో 'గడపగడపకు'

ప్రజాశక్తి-నాదెండ్ల

మండలంలోని అప్పాపురంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రివర్యులు విడదల రజిని పాల్గొన్నారు. ఈ నాలుగేళ్లలో తమ ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల గురించి ఇంటి ఇంటికి తిరిగి వివరించారు.



టిడిపి బీసీ భరోసా బాట

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆదేశాల మేరకు తెదేపా మాచర్ల టౌన్ అధ్యక్షుడు కోమెర దుర్గారావు అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ వడ్డెర సాధికార సమితి ఆధ్వర్యంలో స్థానిక తెదేపా కార్యాలయంలో ఆదివారం బీసీ భరోసా బాట కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వడ్డెర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీరాస్వామి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపాల్ బాబు, పల్నాడు జిల్లా వడ్డెర సాధికార సమితి కన్వీనర్ ఆంజనేయులు, వడ్డే వెంకట్ పాల్గొని మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో అధిక శాతంగా ఉన్న వడ్డెరలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకున్నారన్నారు. భవన నిర్మాణ కూలీలు గా పనిచేసే వడ్డెరలకు ఉపాధి లేక వీధిన పడేలా చేసి,రాయితీ పని ముట్లు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం వడ్డెరలకు న్యాయం చేయ డంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి వడ్డెర సాధికార సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు జి.అంకమరావు,టిడిపి మాజీ కౌన్సిలర్ ఎం. వెంకటేశులు, మాజీ కౌన్సిలర్ వి.వాసు, పట్లవీడు టిడిపి అధ్యక్షుడు బి.అంకమరావు, మాజీ టి.ఎన్.టి.యు.సి సభ్యులు ఎం. అంజి, టిడిపి ప్రధాన కార్యదర్శి బి.రమణ పాల్గొన్నారు.



యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి-పెదకూరపాడు

'పెదకూరపాడు యువగళం- కొమ్మాలపాటి దళం' కార్యక్రమాన్ని నియోజకవర్గ కార్యాలయంలో మాజీ శాసన సభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్ ఆదివారం ప్రారంభించారు . ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతు యువత తెలుగుదేశం పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. యువత భవిష్యత్తును వైసీపీ ప్రభుత్వం నాశనం చేస్తోందని, యువత భవిష్యత్తు అంధకారంలో నెట్టివేయబడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు రమేష్ వడ్లమూడి అప్పారావు ఇంకా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం డాక్టర్స్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని అనన్య హాస్పి టల్ అధినేత డాక్టర్ సింగరాజు సాయికృష్ణ అన్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ సింగరాజు విద్య పాల్గొని బిపి, షుగర్, థైరాయిడ్, గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి 150 పైగా వైద్య పరీక్షలు నిర్వ హించారు. ఉచితంగా మందులు పంపిణీ చేసి ఆరోగ్య సమస్యలకు సలహాలు, సూచనలు చేశారు. ఈ సం దర్భంగా డాక్టర్ సాయికృష్ణ మాట్లాడుతూ సింగరాజు ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. తమ హాస్పిటల్ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరలలో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. డాక్టర్స్ డే సందర్భంగా పల్నాడు బస్టాండ్ లోని నూతన భవనంలోకి మార్చిన అనన్య హాస్పిటల్స్ ప్రాంగణంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాయికృష్ణ తన తండ్రి సింగరాజు మాణిక్యరావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన శాశ్వత తాగునీటి చలివేంద్రాన్ని, ఆయన తల్లి శేషమ్మ ప్రారంభించారు.

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మండల కేంద్రం రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి, గుంటూరు రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. రొంపిచర్లతో పాటు ఈపూరు, నరసరావుపేట మండ లాలకు చెందిన గ్రామస్తులు అధికసంఖ్యలో వైద్యశిబిరంలో పాల్గొని వైద్య సేవలు పొందారు. 700 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పం పిణీ చేశారు. వారిలో 370 మందిని కంటి ఆపరేషన్ చేసేం దుకు గుర్తిం చారు. వారికి శంకర కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి.చక్రారెడ్డి, గుంటూరు రోటరీ క్లబ్ సభ్యులు పి.జగన్మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, రామకోటిరెడ్డి, ఉపాధ్యాయులు ఎన్.రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని సొలసలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరము, కంటి పరీక్షలు నిర్వహించారు. నెక్స్ట్ జనరేషన్ సేవ్ ఆర్గనైజేషన్, గుంటూరు హోప్ విన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక రంగనాయక స్వామి గుడి ఆలయంలో వైద్యులు డాక్టర్ నజీరుద్దీన్, డాక్టర్ రాహుల్ రెడ్డిలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసీజీ, షుగరు, బిపి పరీక్షలు చేసి ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు. సుమారుగా 250 మంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. కంటి పరీక్షలు చేసి 20 మందికి శుక్లములు తొలగించేందుకు గుర్తించారు. వైద్య శిబిరంలో గ్రామ పెద్దలు మద్దూరి వీరారెడ్డి, నెక్స్ట్ జనరేషన్ సేవ్ ఆర్గనైజేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ నాగండ్ల శివ రామకృష్ణ, కృష్ణవేణి, హోప్ విన్ సిబ్బంది, మేనేజర్ నాగేశ్వరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-రాజుపాలెం

స్థానిక కళ్యాణమండపంలో ఆదివారం రాజుపాలెం మండల జనసేనపార్టీ, గుంటూరు ఆదిత్యా మల్టిస్పెషాలిటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మండలం లోని వివిధ గ్రామాల నుండి సుమారు 80 మంది రోగులు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆదిత్య హాస్పటల్ వైద్యులు పాకనాటి కృష్ణ స్రవంత్ తెలిపారు. కార్యక్రమంలో రాజుపాలెం మండల జనసేన పార్టీ అధ్యక్షులు టి.నరసయ్య, ముప్పాళ్ల,నకరికల్లు,సత్తెనపల్లి మండలాల జనసేన పార్టీ అధ్యక్షులు రాజు, ఎన్. కోటేశ్వరరావు, పి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నరసరావుపేట

సేవా భావంతో గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వేద హాస్పిటల్ అధినేత డాక్టర్ నవులూరి క్రాంతి కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం రొంపిచర్ల మండలంలోని బుచ్చిపాపన్నపాలెంలో నరసరావుపేట వేద హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గ్రామస్తులకు బిపి,షుగర్, థైరాయిడ్, జలుబు, దగ్గు, జ్వరం వంటి సాధారణ వ్యాధులతో పాటు గుండె సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ క్రాంతి కుమార్ రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజులలో గ్రామీణ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.




వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ విద్య, శాశ్వత తాగునీటి చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ సాయికృష్ణ తల్లి శేషమ్మ



రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ..



యడ్లపాడు మండలంలోని సొలసలో..



రాజుపాలెంలో..



బుచ్చిపాపన్నపాలెంలో ..

ప్రైవేట్ విద్యాసంస్థలపై నియంత్రణ లోపించింది

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ప్రైవేటీకరణ వలన విద్య వ్యాపారంగా మారిపోయిందని రాష్ట్ర మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ అన్నారు. సత్తెనపల్లిలో కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థినీ విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది .ట్రస్టు చైర్మన్ మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్,ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య వి.బాలమోహన్‌దాస్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ విద్యారంగానికి జీడిపి లో 8 శాతం కేటాయించాల్సి ఉండగా కేవలం 4 శాతం మాత్రమే కేంద్రం కేటాయించటం బాధాకరమని అన్నారు. విద్యా ప్రమాణాలు రోజురోజుకూ దిగజారుతున్నాయని, ప్రైవేటు విద్యాసంస్థలు ర్యాంకుల కోసం బట్టీ చదువులకు ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత ఇవ్వడం లేదని విమర్శించారు. ప్రైవేటు విద్యాసంస్థలపై ప్రభుత్వ నియంత్రణ లోపించిందని అన్నారు . ఆకర్షణలు ప్రలోభాలకు లోనుకాకుండా విద్య సముపార్జనపై దృష్టి సారిస్తే భవిష్యత్ బాగుంటుందని విద్యార్థిని విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. బాల మోహన్ దాస్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి 5 గంటలు పాటు మొబైల్ ఫోన్లు వాడుతున్నట్లు ఒక సర్వేలో తేలిందన్నారు. ప్రతి విద్యార్థి సమాయా పాలన క్రమశిక్షణ కలిగివుండాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సి పల్ మాజీ చైర్మన్ యెలినేడి రామస్వామి, కన్నా నాగరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నిమ్మగడ్డ రమేష్ కుమార్

ములకలూరులో బిఆర్ఎస్‌లో చేరికలు

ప్రజాశక్తి - నూజెండ్ల



బిఆర్ఎస్ నాయకులు సురభి దేవసహాయం ఆధ్వర్యంలో ములక లూరులో ఆదివారం ఆ పార్టీలోకి విరివిగా చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా దేవసహాయం మాట్లాడుతూ దేశం భవిష్యత్తు బిఆర్ఎస్ తోనే సాధ్యమన్నారు. తెలంగాణాను బంగారు తెలంగాణా దిశగా అడుగులు వేస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్ ఆశయాలు పట్టుదల, అనేక సంక్షేమ పథకాలు, తననెంతో ప్రభావితం చేశాయని కొనియాడారు.

విత్తన కొనుగోలులో జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

రోజుకో కొత్త విత్తనాల కంపెనీలు పుటుకొస్తున్నాయని, విత్తనాలను ప్రయివేటు వ్యక్తుల దగ్గర గాని, విడిగా గాని కొనుగోలు చేయవద్దని రైతులకు వ్యవసాయ కార్మిక సంఘం మండ లాధ్యక్షులు సాతులూరి లూథర్ అన్నారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ అప్పు తీసుకుం టున్నాము కనుక ఎదో ఒకటి అనే భావన లేకుండా కచ్చితమైన నిర్ణయంతో కొనుగోలు చేయాలని సూచించారు. ప్రచారా లను, ఆకర్షణీయమైన ప్రకటనలను చూసి మోసపోవద్దని అన్నారు. ముఖ్యముగా మిర్చి విత్తనాలు కొనుగోలు చేసే విషయం లో ఆయా కంపెనీల పూర్తి చరిత్ర తెలుసుకుని కొనుగోలు చేయాలన్నారు. లేదా విత్తనాలు అమ్మకపు షాపు వారు పూర్తిగా తెలిసి ఉండాలని, కొన్న ప్యాకెట్లకు సీలు ఉండాలని, దానిపై ఆ కంపెనీ వారి పూర్తి వివరాలు,మొలక శాతం తదితర వివరాలు ప్రింటింగ్ ఉండాలని, ఈ విషయాలన్నింటిని చూసి కొనుగోలు చేయాలని, దుకాణదారుడి వద్ద రసీదు తీసుకోవాలని సూచించారు. సంవత్స రం మొత్తం రసీదుతో పాటు ఆయా ప్యాకెట్ల కవర్లను కూడా జాగ్రత్తగా ఉంచాలని అన్నారు. నారు పోయించే యజమానులు కూడా తెలిసిన వారి వద్దనే పోయించాలన్నారు.

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రచారం

ఇప్పటికే గ్రామాల్లో వివిధ రకాల పంటలకు సంబంధించిన విత్తనాలను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రచారం చేస్తుందని వ్యవసాయశాఖ అధికారి టి.శ్రీలత అన్నారు.విత్తనాలను గ్రామాల్లో జీపుల ద్వారా అను మానిత వ్యక్తులు ద్వారా బిల్లు లేకుండా అమ్మే వారి వివ రాలు వ్యవసాయ శాఖకు తెలియజేయాలన్నారు.

పోలవరం నిర్వాసితులకు సంఘీభావ నిధి


నేతాజికి నిధి అందజేస్తున్న మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పోరాటానికి సంఘీభావంగా సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ సంఘీభావం నిధి అందచేసింది. ఆదివారం నగరంలో నిర్వహించిన యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో మెడికల్ రిప్రజెంటివ్‌లు ఈ మొత్తాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజికి యూనియన్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని, గతేడాది వచ్చిన గోదావరి వరదల వల్ల 190పైగా గ్రామాల ప్రజలు తమ ఇల్లు వదిలి నెలల తరబడి కొండలపై తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకొని బ్రతకాల్సి వచ్చిందని అన్నారు. అలాంటి వారికి ప్రభుత్వాలు కనీసమైన సహకారం కూడా అందించలేదని విమర్శించారు. పోలవరం నిర్మాణం పూర్తయితే నిర్వాసితులంతా శాశ్వతంగా తమ నివాసాలు, భూములు కోల్పోవాల్సి వస్తుందని, కావున అలాంటి వారి పునరావాసం కల్పించిన తర్వాతే ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై జూన్ 20 నుండి జూలై 4 వరకు మహాపాదయాత్ర జరుగుతోందని, ఈ పోరాటానికి కార్మికవర్గం తరపున సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ రిప్రెజెంటేటివ్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఫణి, సలీం, ఆనంద్, శ్రీనివాస్, హనుమంతరావు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిరండి

ప్రజాశక్తి - మంగళగిరి

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం విజయవాడ ధర్నా చౌక్‌లో మంగళవారం జరిగే కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ధర్నా పోస్టర్‌ను స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులు ప్రారంభమై 18 ఏళ్లయినా నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్రాలు విఫలమయ్యాయని విమర్శించారు. ముంపు వల్ల 70 గ్రామాలు మునిగిపోతాయని, ఆ గ్రామాల రిసర్వే చేసి పునరావసం ఏక కాలంలో చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌ఆర్ పరిహారం అర్హులందరికీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, పట్టణ కార్యదర్శి వై.కమలాకర్, నాయకులు పి.బాలకృష్ణ, ఎం.బాలాజీ పాల్గొన్నారు.



ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

జెసిఎస్ మంగళగిరి ఇన్‌ఛార్జిగా ఫిరోజ్



ప్రజాశక్తి - మంగళగిరి

వైసిపి మంగళగిరి పట్టణ జెసిఎస్ ఇన్‌ఛార్జిగా ఎమ్‌డి ఫిరోజ్‌ను జెసిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కందుల రవీంద్రరెడ్డి ఆదివారం ప్రకటించారు. ఫిరోజ్ మాట్లాడుతూ తమ నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పట్టణంలోని 32 వార్డుల్లోని 20 సచివాలయాల ద్వారా ప్రభుత్వ పథకాలు ప్రతి పేదవానికి అందుతు న్నాయా? లేదా? అని పరిశీలించి అర్హత ఉండి పథకాలు అందని వారిని గుర్తించి అందేలా చేస్తామని చెప్పారు. ఈ క్రమంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లను సమన్వయపరచుకుంటామని అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో 2024లో వైసిపి విజయపతాకను మరోసారి ఎగరేయడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు.


ఆవిష్కరణలో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, రాజకుమారి

ఆహార వైద్యం గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి-తెనాలి : ఆరోగ్య వైద్యం గ్రంథ ఆవిష్కరణ సభ స్థానిక కొత్తపేటలోని ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ తెనాలి శాఖ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. గ్రంథ రచయిత లక్కరాజు సాయి అధ్యక్షతన జరిగిన సభలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి ముఖ్య అతిథులుగా పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఆలపాటి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకుంటే శారీరక మానసిక రుగ్మతలకు దూరంగా ఉండొచ్చన్నారు. గ్రంథాన్ని రచించిన లక్కరాజు సాయిని అభినందించారు. కార్యక్రమంలో స్వరలయ వేదిక సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

మహేంద్రనాథ్ సేవలు స్ఫూర్తిదాయకం

సంస్మరణ సభ, ప్రత్యేక సంచికావిష్కరణలో డొక్కా మాణిక్య వరప్రసాద్


నివాళులర్పిస్తున్న మాణిక్య వరప్రసాద్ తదితరులు

ప్రజాశక్తి - గుంటూరు

ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో నాలుగు దశాబ్దాల క్రితం అతి పేద దళిత నాయకుడిగా ఆరుసార్లు ఎమ్మెల్యేగా నలుగురు ముఖ్య మంత్రుల వద్ద పదికి పైగా మంత్రిత్వ శాఖలు నిర్వహించి నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంగా పుట్టపాగ మహేందర్‌నాథ్ నిలిచారని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. మహేందర్‌నాథ్ సామాజిక, రాజకీయ సేవలు వర్తమాన భావితరాలకు ఆదర్శప్రాయమని చెప్పారు. మహేంద్రనాథ్ సంస్మరణ సభ స్థానిక బ్రాడీపేటలోని కొరటాల సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. సభకు సీనియర్ న్యాయవాది, సామాజిక ఉద్యమకారుడు సంకూరి రాజారావు అధ్యక్షత వహించారు. మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ ఎన్‌టి రామారావు మంత్రివర్గంలో రెవెన్యూ, ఆర్థిక, శాఖ మంత్రిగా పని చేశారని, కరణాలు, మున్సబ్‌ల వ్యవస్థలను రద్దుచేసి విప్లవాత్మక మార్పుకు నాంది పలికారని అన్నారు. అన్ని ఉన్నత పదవులు అనంతరం పదవిలేని సమయంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసి సాధారణ జీవితం గడపటం మహేంద్ర నాథ్ నిజాయితీకి నిదర్శనమని చెప్పారు. దళిత బహుజన ఫ్రంట్ నాయకులు కొరివి వినయ్ కుమార్ మాట్లాడుతూ మహేంద్రనాథ్ జీవితం త్యాగపూరితమైనదని కొనియాడారు. కర్ణాటక అటవీశాఖ డిజిపి పుట్టపాగ రవీంద్రనాథ్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లాలో మౌలిక వసతుల కల్పనకు తమ తండ్రి విశేషంగా కృషి చేశారన్నారు. తొలుత మహేంద్రనాథ్ స్మారక సంచికను ఆవిష్కరించారు.

పోలీస్ పోస్టుల ఈవెంట్స్, పరీక్షల కోసం ఉద్యమం

ప్రజాశక్తి - గుంటూరు

'బెహతర్ భారత్ బునియాది' పేరుతో బెంగుళూరులో యూత్ కాంగ్రెస్ నిర్వహించే జాతీయ కన్వెన్షన్‌లో అత్యధిక యువత నమోదు చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కె.జవహర్‌బాబు కోరారు. మెరుగైన భారతదేశం నిర్మాణం కోసం సలహాలు, సూచనలను స్వీకరించడానికి యూత్ కాంగ్రెస్ సిద్ధంగా ఉందని, అందుకు ప్రతి ఒక్క యూత్ కాంగ్రెస్ కార్యవర్గ సభ్యుడు ఉత్సాహం చూపాలని అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించగా యూత్ కాంగ్రెస్ గుంటూరు ఇన్‌ఛార్జి బి.తిరుమలేష్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలో జగన్ అధికారం చేపట్టిన నాటి నుండి యువతకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కరువయ్యాయని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, మెగా డీఎస్సీని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ, కానిస్టేబుల్ రిక్రూట్మెంట్ నోటిఫికేషన్ విడుదల చేసి ప్రిలిమ్స్ పరీక్షలు నిర్వహించి క్వాలిఫై అయినా అభ్యర్థులకు ఆరు నెలలైనా ఈవెంట్స్, మెయిన్స్ పరీక్షలు నిర్వహించలేదని అన్నారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. సమా వేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వర రావు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నూనె పవన్‌తేజ, నాయకులు పి.అనిల్, పి.ప్రసాద్, సిహెచ్ ప్రదీప్, అశోక్ ఆనంద్, మహమూద్, మహబూబ్ అలీ, జయరాం, మహేష్, మస్తాన్‌వలి, భరత్, హేమంత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కె.జవహర్‌బాబు



అనారోగ్య బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మంగళగిరి : పట్టణంలోని కొత్తపేటకు చెందిన జి.లక్ష్మి అనారోగానికి గురయ్యారు. ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రూ.10 వేలను సమకూర్చగా ఈ మొత్తాన్ని ఆమెకు వైసిపి నాయకులు ఆదివారం అందించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎం.మల్లేశ్వరరావు, ఎమ్‌డి ఫిరోజ్, ఎ.రాజేష్ పాల్గొన్నారు.

వంగవీటి చైతన్య రథసారథులు పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-తెనాలి : వంగవీటి మోహనరంగా ప్రజల్లో చిరస్థాయిగా నిలిచారని ప్రముఖ రచయిత తుర్లపాటి సురేష్ అన్నారు. రంగా జీవిత చరిత్ర పై రచించిన వంగవీటి చైతన్య రథసారథులు పుస్తకావిష్కరణ సభ పట్టణానికి చెందిన రాధా రంగా స్మారక సమితి ఆధ్వర్యంలో స్థానిక కవిరాజా పార్కులోని వీజీకే భవన్లో ఆదివారం జరిగింది. రచయిత మాట్లాడుతూ సోషల్ మీడియాలో తాను వ్యక్తీకరించిన జ్ఞాపకాలను పుస్తక రూపంలో తెచ్చిన వంగవీటి రాధా రంగ స్మారక కాపు యువజన సేవా సమితి అధ్యక్షులు తన్నీరు శివశంకర్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమానికి డాక్టర్ టి.కల్యాణ్ కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించగా సిహెచ్.శ్రీనివాసరావు, ఏటుకూరు మాజీ సర్పంచ్ యు.సీతారామయ్య, తెనాలి వ్యవసాయ మార్కెట్ మాజీ ఛైర్మన్ టి.వెంకట రమణారావు, సాయిజ్యోత్స్న, న్యాయవాది పి.విజయకుమార్, బి.విజయ్, జి.విజయకుమార్ పాల్గొన్నారు.

విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యం

ప్రొఫెసర్ కందేపు సురేంద్రనాథ్

ప్రజాశక్తి - గుంటూరు

విశ్వకర్మలు విద్యావంతులు అవడం ద్వారానే సామాజిక, ఆర్థిక, రాజకీయ మనుగడ సాధ్యమనేది ప్రతి ఒక్కరూ గుర్తించాలని ప్రొఫెసర్ కందేపు సురేంద్రనాథ్ అన్నారు. స్థానిక అరండల్‌పేట ఆంధ్ర రాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం ప్రాంగణంలో శ్రీ విశ్వకర్మ పేద విద్యార్థి సంక్షేమ సంఘం 26వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, పుస్తకాలు, ఇతర విద్య ఉపకరణాలు పంపిణీ చేశారు. పేద విద్యార్థి సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు గోనుగుంట శేషగిరిరావును తుర్లపాటి శంభాయాచార్య లలిత కళా పురస్కారం అందజేశారు. సినీ దర్శక, నిర్మాత గన్నే వాసుదేవరావు, దారుశిల్పి కొమరవల్లి సాంబశివరావు, విశ్వకర్మ పీఠం వ్యవస్థాపకులు నందిపాటి నాగమల్లేశ్వరరావును సత్కరించారు. సభకు సంక్షేమ సంఘం అధ్యక్షులు పట్నాల శివప్రసాద్ అధ్యక్షత వహించగా పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కె.సుబ్బారావు, మాజీ కార్పొరేటర్ సిహెచ్.సాంబశివరావు, సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు కె.వెంకట్రావు, బంగారుబాబు, శివరామకృష్ణ, కార్యదర్శి కె.కృష్ణారావు, కార్యనిర్వాహక కార్యదర్శులు సిహెచ్ వెంకట వసంతరావు, పి.శ్రీనివాస్, కోశాధికారి సిహెచ్.సుధీర్‌బాబు పాల్గొన్నారు.



సత్కారం పొందుదున్న ప్రొఫెసర్ కందేపు సురేంద్రనాథ్



జిల్లాకు గర్వకారణంగా భాష్యం విద్యాసంస్థలు

విజయోత్సవ సభలో ప్రముఖులు

ప్రజాశక్తి-గుంటూరు

చిన్న విద్యాసంస్థగా మొదలైన భాష్యం విద్యాసంస్థ ప్రస్థానం అంచెలంచెలుగా ఎదిగి ఈరోజు జెఈఈ అడ్వాన్స్‌డ్-2023 పరీక్షల్లో ఆలిండియా 5, ఆలిండియా 10వ ర్యాంకులను కైవసం చేసుకొని రెండు తెలుగు రాష్ట్రాల్లో తనదైన ఘనతను చాటడం ఎంతో గర్వకారణంగా ఉందని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం భాష్యం మెయిన్ క్యాంపస్‌లో ఆలిండియా ర్యాంకులను సాధించిన భాష్యం ఐఐటి జెఈఈ అకాడమీ విద్యార్థులు ఎ.వెంకటశివరామ్, వై.వి.మణీందర్‌రెడ్డిని నగరానికి చెందిన విద్య, వైద్య, రాజకీయ ప్రముఖుల సమక్షంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. పుల్లారావు మాట్లాడుతూ గుంటూరు జిల్లాకే గర్వకారణంగా భాష్యం విద్యాసంస్థలు నిలిచాయని కొనియాడారు. జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన వెంకటశివరామ్, వై.వి.మణీందర్‌రెడ్డిలకు ఉన్నత విద్యాభ్యాసం నిమిత్తం ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున రూ.20 లక్షలు నగదు ప్రోత్సాహకాన్ని రామకృష్ణ అందించటం ముదావహమని అన్నారు. తొలుత భాష్యం ఐఐటి జెఈఈ అకాడమీ ప్రోగ్రామర్ ఆనంద్‌కుమార్ భాష్యం సాధించిన విజయాల గురించి ఆహుతులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎ.వెంకటశివరామ్, వై.వి.మణీందర్‌రెడ్డిలకు గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, టిడిపి సత్తెనపల్లి ఇన్‌చార్జి కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, నగరానికి చెందిన పలువురు పురప్రముఖులు అభినందనలు తెలిపారు. ఐఐటి బాంబే వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో ఉన్నత విద్య అభ్యసించటానికి వెళుతున్న వెంకటశివరామ్, మణీందర్‌రెడ్డిలు భవిష్యత్‌లో ఉన్నత విజయాలు అందుకోవాలని ఆహుతులు ఆకాంక్షించారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ 6 దశాబ్దాల ఐఐటి చరిత్రలో గుంటూరు జిల్లా మొదటిసారిగా ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 5, 10 ర్యాంకులు కైవసం చేసుకొని, జిల్లాకే గర్వకారణంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో వీరేంద్రచౌదరి, భాష్యం డైరెక్టర్ హనుమంతరావు, భాష్యం సలహాదారు మైఖేల్‌రాజ్, జెడ్‌ఇలు పాల్గొన్నారు.

రైతులు, కూలీలను దెబ్బకొడుతున్న ప్రభుత్వాలు

- సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు
- వ్యవసాయాన్ని వామపక్షాలు మినహా ప్రధాన పార్టీలు పట్టించుకోవడం లేదు
- విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త ఎన్.వేణుగోపాలరావు
- వ్యవసాయ పరిరక్షణకు రైతులు, కౌలురైతులు, కూలీలు ఐక్యంగా పోరాడాలని సదస్సు పిలుపు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు

ప్రజాశక్తి - యడ్లపాడు

దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి వెన్నుదన్నుగా ఉన్న రైతులు, కౌలురైతులు, కూలీల ప్రయోజనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దెబ్బకొడుతున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పేలా విధానాలను అమలు చేస్తున్నారని, వీటిని తిప్పికొట్టేందుకు సాగుతున్న ఉద్యమాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'వ్యవసాయ రంగం కార్పొరేటీకరణ – ప్రతిఘటనలో వ్యవసాయ కార్మికుల పాత్ర' అంశంపై సదస్సు మండల కేంద్రమైన యడ్లపాడులోని తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం రాత్రి జరిగింది. సదస్సుకు వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రోశయ్య అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా సుబ్బారావు మాట్లాడారు. రైతులు, కూలీలు పరస్పరం సహకరించుకుంటూ కృషి చేస్తేనే మనుగడ సాధ్యమన్నారు. వ్యవసాయ రంగంలో కార్పొరేట్ పెట్టుబడిదారులు ప్రవేశించి యాంత్రీకరణ చేస్తున్నారని, రైతుల స్థానంలో కార్పొరేట్లు, కూలీల స్థానంలో యంత్రాలు రావడం ద్వారా ఇక్కడి ప్రజల ఉపాధి దెబ్బతినడంతోపాటు దేశీయ ఆహార అవసరాలూ ప్రమాదంలో పడ్డాయని వివరించారు. దేశ అవసరాల కోసం ఆహార పంటలను కాకుండా విదేశాల్లో అవసరమైన పంటలను కార్పొరేట్లు పండించి వ్యాపారం చేసుకుంటారని అన్నారు. దేశంలో 80 కోట్ల మంది ఆధారపడ్డ వ్యవసాయ రంగంపై విదేశీ, కార్పొరేట్ల పెత్తనం మొత్తం దేశానికే నష్టమని ఆందోళన వెలిబుచ్చారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఇలాంటి వినాశనకర విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో రైతులతోపాటు కూలీలూ ముందువరసలో ఉండాలని అన్నారు. రైతు రక్షణ వేదిక అధ్యక్షులు, విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త ఎన్.వేణుగోపాలరావు మాట్లాడుతూ వ్యవసాయంలో కూలీల ప్రాధాన్యాన్ని పుచ్చలపల్లి సుందరయ్య ఏనాడో గుర్తించారని, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడ్డానికి సంఘాన్నీ నిర్మించారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం గతంలో తెచ్చిన మూడు నల్ల చట్టాల వల్ల వ్యవసాయం మొత్తం బహుళజాతి కంపెనీల చేతుల్లోకి పోతుందని, అందుకే ఆ చట్టాలను రైతులు తిప్పికొట్టారని అన్నారు. వ్యవసాయంపై వామపక్షాలు మినహా మిగతా ప్రతిపక్షాలూ పట్టించుకోవడం లేదన్నారు. కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయం దండగ అనే ఆలోచనల్లో వ్యవసాయదార్లు ఉన్నారని, రైతులు, కౌలురైతులు, కూలీలు కలిసి ఉద్యమాల్లోకి రావడం ద్వారా పరిస్థితిల్లో మార్పులను సాధించుకోవాలని చెప్పారు. పల్నాడు జిల్లాలో వేలాది ఎకరాలు భూములు సాగుకు నోచక పడావుగా పడి ఉన్నాని, కౌలురైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా వీటిని నివారించడానికి, ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వాలు చర్యలేమీ తీసుకోవడం లేదని విమర్శించారు. కౌల్దార్లకు గుర్తింపు కార్డుల జారీ తూతూమంత్రంగానే ఉందని, వారికి అందుతున్న సహకారం ఏమీ లేదని చెప్పారు. అప్పులు చేసి పంటలు పండిస్తున్నారని తెలిపారు. వ్యవసాయ పరిరక్షణ కోసం రైతులు, కూలీలు ఐక్యంగా పోరాడాలన్నారు. సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శివనాగరాణి, పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, నాయకులు టి.కోటేశ్వరరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

రోగులను సంతోషంగా పంపడమే లక్ష్యం

- శస్త్రచికిత్సల్లో జాప్యాన్ని నిరోధిస్తాం
- క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేస్తాం
- దాతల సాయంతో అభివృద్ధికి కృషి
- ప్రజాశక్తితో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్

గుంటూరు

ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన చికిత్సలు అందించడంతోపాటు వారు సంతోషంగా ఇంటికి వెళ్లేలా కృషి చేస్తామని ఆస్పత్రి నూతన సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్ తెలిపారు. రోగులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని, దిగువ స్థాయి సిబ్బంది సేవలు పెంచడం ద్వారా రోగులకు మరింత సంతృప్తికరమైన వాతావరణం ఏర్పరుస్తామని తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలను తెలిపారు.





ఆస్పత్రిలో మీ మొదటి ప్రాధాన్యత?

రోగుల సంరక్షణ, అత్యవసర కేసులు, సత్వర వైద్యం అందించడమే మొదటి ప్రాధాన్యంగా భావిస్తున్నాం. అందుబాటులో వైద్యసిబ్బంది, మానవత్వంతో కూడిన వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తాం. అత్యవసర చికిత్స విభాగం సమన్వయ పరచి సత్వర చికిత్సకు చర్యలు తీసుకుంటాం. ఆధునిక ల్యాప్రోస్కోపి వైద్యం పేదలకు అందుబాటులోకి తెస్తాం. సిబ్బందిలో జవాబుదారీతనం పెంపునకు చర్యలు తీసుకుంటాం. అన్నిరకాల మందులు పరీక్షలు ఉచితంగా పేదలకు అందిస్తాం.

శస్త్ర చికిత్సల్లో జాప్యాన్ని ఎలా నివారిస్తారు?

అత్యవసర వైద్య విభాగంలో ఆపరేషన్ గదుల పెంపునకు కృషి చేస్తాం. అత్యవసర విభాగంలోకి వచ్చిన గంటా రెండు గంటల్లోనే అత్యవసర ఆపరేషన్లు చేసేలా కృషి చేస్తాం. గతంలో ఉన్న జాప్యాన్ని నివారిస్తాం. వార్డుల్లో లివర్, కిడ్నీ,కాక్లియార్, కీళ్ల మార్పిడీ, గుండె, క్యాన్సర్ ఆపరేషన్లు రోజువారి చేయడానికి కృషి చేస్తాం. ఆరోగ్యశ్రీ చికిత్సలు ఎక్కువ జరిగేలా చర్యలు తీసుకుంటాం? గైనిక్ వార్డులో తల్లి-బిడ్డ వైద్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం.

పరిశుభ్రతకు తీసుకునే చర్యలు?

పరిశుభ్రత, పచ్చదనం కై క్లాప్ క్లీన్ ఎపి విధానం ద్వారా జగనన్న స్వచ్ఛ సంకల్పను మరింత సమర్ధవంతంగా అమలు చేస్తాం. పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యమిస్తాం. రోగుల సహాయకులు ఎక్కువ మంది రావడం వల్ల పెరుగుతున్న అపరిశుభ్రమైన పరిస్థితిపై పారిశుధ్య విభాగంతో ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తాం. టాయ్‌లెట్‌ల నిర్వహణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండేలా చూస్తాం.

పెరుగుతున్న రోగుల దృష్ట్యా పెరగాల్సిన సౌకర్యాలు?

మంచాల సంఖ్య పెరగాల్సి ఉంది. ఫ్లోర్‌పై చికిత్సలు చేయకుండా ప్రతి ఒక్కరికి మంచాలు అందుబాటులో ఉంచేలా ప్రయత్నిస్తాం. ఎంసిహెచ్ బ్లాక్ నిర్మాణం పూర్తయితే ఈ సమస్య చాలావరకు తగ్గుతుందని భావిస్తున్నాం. జనరల్ మెడిసిన్ విభాగంలో రోగుల తాకిడి ఎక్కువగా ఉందని, ఉన్న మంచాలు సరిపోవడం లేదని సిబ్బంది తన దృష్టికి తీసుకురాగానే 50 మంచాలు అదనంగా కేటాయించాం.

అంబులెన్సు నిర్వహకుల దందా నివారిస్తారా?

అంబులెన్స్ నిర్వహణపై నియంత్రణ పెంచుతాం. మహప్రస్థానం, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ అంబులెన్సుల వద్ద లంచాలు, దందాలను అరికడతాం.

నిధుల కొరతతో అభివృద్ధి నిలిచిపోతుందా?

అన్నింటికి ప్రభుత్వంపై ఆధారపడకుండా దాతల సహకారంతో ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. కొన్ని ముఖ్యమైన పనులు దాతల సహకారంతో పూర్తిచేస్తాం.

ఆస్పత్రిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సమస్య?

అస్తవ్యస్త పార్కింగ్‌పై దృష్టిసారించి క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటాం. వాహనాల పార్కింగ్ సక్రమంగా జరిగేలా ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తాం.

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

జి-ప్యాట్-2023 ఫలితాల్లో చలపతి ఫార్మసీ విద్యార్థులకు జాతీయ ర్యాంకులు

ప్రజాశక్తి - తాడికొండ

జి-ప్యాట్-2023 పరీక్షా ఫలితాల్లో చలపతి ఫార్మశీ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో 1636వ ర్యాంకును, 1772వ ర్యాంకులతో పాటు పలుర్యాంకులను సాధించారని ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం కళాశాల ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ గతనెల 22వ తేదీన భారత ప్రభుత్వపు మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ డవలప్‌మెంట్ వారు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వారి సహకారంతో జి.ప్యాట్-2023 పరీక్షను అఖిల భారత స్థాయిలో నిర్వహించినట్లు తెలిపారు. తాజాగా ఫలితాలు విడుదలవ్వగా చలపతి ఫార్మశీ కళాశాల విద్యార్థులు 14 మంది జాతీయ స్థాయిలో ర్యాంకులను సాధించారని అన్నారు. ఎన్.ముఖేష్ 97.3 శాతంతో 1636వ ర్యాంకు, ఎ.శ్రావణి 94.1 శాతంతో 1772వ ర్యాంకు, ఎం.సోను 96.3 శాతంతో 2286వ ర్యాంకు, షేక్ సాజిద్ 95.8 శాతంతో 2619వ ర్యాంకు, కె.అమృత వర్షిణి 95.4 శాతంతో 2844వ ర్యాంకు సాధించినట్లు వివరించారు. 14 మంది అర్హత పొందారన్నారు. ర్యాంకర్లను చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు అభినందించారు.